సంపుటి : 10
సంచిక : 04
బుధవారం
30 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

E-PAPER

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999





## పెత్తందార్లం కాదు..

# ప్రజలకు సేవకులం

- ప్రజలు వేసిన ఓటు వృధా కాలేదు... నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన
- దూసుకెళ్తున్న డబులింజన్ పాలన... జెట్ స్పీడ్ వేగంతో అభివృద్ధి
- గ్రామాభివృద్ధిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేశారు
- ఉదయగిరి పల్లె పండుగ-3.0 బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- పల్లె పండుగ-3.0లో భాగంగా రూ.11,085 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీ జీ రాంజీ శ్రామికుల వద్దకెళ్లి శ్రమదానం చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**ఉదయగిరి, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం వరికుంటంపాడు మండలం, రామాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రూ.11,085 కోట్ల విలువైన గ్రామీణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ-3.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,700 కోట్లతో 6 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల మిగతా .. 2లో..

---

కొచ్చిలో లోకేష్‌కు ఆత్మీయ స్వాగతం పలికిన

## తెలుగు ప్రజలు



**సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి, ఎల క్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ కేరళలోని కొచ్చి చేరుకున్నారు. కొచ్చి వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా టుడే సౌత్ ఇండియా సమ్మిట్'లో పాల్గొనేం దుకు ఆయన అక్కడికి వచ్చారు. ఈ సదస్సులో ఆయన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతి ప్రస్థా నంపై కీలక ప్రసంగం చేయనున్నారు. "ఆంధ్ర ప్రదేశ్ ప్రగతి ప్రస్థానం - పాలన, అభివృద్ధి, విద్య, ప్రపంచ స్థాయి లక్ష్యాలు" అనే అంశంపై మంత్రి లోకేశ్ ప్రసంగించనున్నారు. ఈ సం దర్భంగా రాష్ట్రంలో సుపరిపాలన, ఆర్థికాభివృద్ధి, విద్యా రంగంలో మిగతా .. 2లో..

---

## రూ.35కే కేజీ ఉల్లిపాయలు

- ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- తొలి దశలో విజయవాడలోని అన్ని రైతు బజార్లలో నేటి నుండి అమలు
- ఆధార్/రేషన్ కార్డు ఆధారంగా కుటుంబానికి నెలకు 2 కేజీలు
- ప్రజల డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వెల్లడి



**అమరావతి, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఉల్లిపాయల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నేటి నుంచి రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను రూ.35కే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలి దశలో విజయవాడ నగరంలోని అన్ని రైతు బజార్లలో సబ్సిడీ ధరకు ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు 2 కేజీల చొప్పున, కేజీ రూ.35 ధరకు ఉల్లిపాయలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు మిగతా .. 2లో..

---

సైబర్ స్టాకింగ్ పెరిగింది..

## మహిళలు అప్రమత్తం

ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్



**తిరుపతి, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** టెక్నాలజీ వినియోగం పెరగడంతో భౌతిక వేధింపుల (ఫిజికల్ స్టాకింగ్) కంటే సైబర్ స్టాకింగ్ (ఆన్ లైన్ వేధింపులు) కేసులు ఎక్కువ య్యాయని, ఆన్‌లైన్ వేధింపుల పట్ల మహిళలు అత్యంత అప్ర మత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన 'స్టాకింగ్ నివారణ' అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా వేధించడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటివి పెరిగాయని శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక నంబర్‌ను మిగతా .. 2లో..

---

మోదీని ఎదుర్కోలేక

## ఈసీ, ఈవీఎంలపై నిందలేస్తారా?

కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని మోదీని ఎదుర్కొనే దమ్ములేక ఎన్నికల సంఘం, ఈవీఎంలపై నిందలేస్తారా? అని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిచినప్పుడు మిగతా .. 2లో..

---

ఉక్రెయిన్‌తో యుద్ధం..

## అమెరికా మాజీ సైనికులకు రష్యా ఎర



**సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** నాలుగేళ్లకుపైగా రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల కాలంలో ఇరుదేశాలు భీకర దాడులు చేసుకుంటున్నాయి. స్వదేశీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రజలను యుద్ధంలో పోరాడేందుకు రష్యా ఎప్పటినుంచో నియమించుకుంటోంది. ఈ నేపథ్యంలో మరో కొత్త విషయం మిగతా .. 2లో..

---

మేం ట్యాంపరింగ్ చేస్తే

## 400 సీట్లు వచ్చేవి

కాంగ్రెస్‌పై ఈటల ఫైర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓట్ల ట్యాంపరింగ్ విష యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణ లపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మిగతా .. 2లో..

---

## "నేను ఇరాన్‌కు ఏ హామీ ఇవ్వలేదు"

ఆంక్షల సడలింపుపై ట్రంప్



**సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌కు ఆంక్షల సడలింపు, నిలిపివేసిన నిధుల విడుదలకు తాను ఎలాంటి ప్రతిపాదన చేయలేదని స్పష్టం చేశారు. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను సడలించేందుకు అమెరికా సిద్ధమైందని వస్తోన్న వార్తలను ఆయన ఖండించారు. "ఇది అవాస్తవం. నేను వారికి హామీ ఇవ్వలేదు" అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధికారులు మాత్రం ఇరాన్‌తో పరోక్ష చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. "ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ సంప్రదింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై ఇరాన్ స్పష్టమైన హామీలు ఇవ్వాలని అమెరికా కోరుతోంది" అని చెబుతున్నారు.

**ఇరాన్ దాడుల్లో యూఎస్ సైనికులకు గాయాలు**

ఇరాన్ దాడిలో ఎనిమిది మంది అమెరికా సైనికులు తీవ్రంగా గాయపడిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 14న హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేసినట్లు అమెరికా అధికారులు తెలిపారు. దాడి సమయంలో అందులో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనను అమెరికా ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించనప్పటికీ.. తాజాగా సైనికుల గాయాల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న సమయంలోనే ఇది బయటపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధ తీవ్రతను మిగతా .. 2లో..

---

మలేరియా కేసుల నియంత్రణలో

## నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

-వార్త 2లో..






(మొదటిపేజీ తరువాయి)

## పెత్తందార్లం కాదు... ప్రజలకు సేవకులం

బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనం చేశారు. అలాగే పాడి రైతుల కోసం రూ.300 కోట్లతో 22 వేల మినీ గోకులాల నిర్మాణం, రూ.225 కోట్లతో 50 వేల ఎకరాల్లో ఉద్యాన తోటల పెంపకానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రూ.110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పల్లె పండుగ ద్వారా నాంది పలుకుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్ వేస్తున్నామని... రోడ్ల ఏర్పాటుతో రాకపోకలు సాఫీగా సాగుతాయని... ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ. 50 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని... పల్లెల్లోనూ కనివిని రీతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. ప్రజల కళ్లకు కనబడేలా అభివృద్ధి చేస్తున్నామని... గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసే అంశంపై దృష్టి పెట్టామన్నారు. గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నామని... ప్రతి ఒక్కరికీ ఇల్లు.. ఇంటి స్థలం, విద్యుత్, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వర్ణాంధ్ర గ్రామాలే నాంది పలకాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని... పేదరికం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు.. ఆర్థిక అసమానతలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

**పల్లె వికాసంలో పవన్ చొరవ అభినందనీయం**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇప్పటికే మూడు పల్లె పండుగ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఉద్యమ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని, పల్లె వికాసంలో ఆయన తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అభినందించారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా పవన్ అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. రెండున్నర దశాబ్దాల తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలోని వివిధ హోదాల్లో ఉన్న 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేశామని చెప్పారు. లక్షకు పైగా పంటకుంటలు తవ్వించడంతో పాటు పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మించామని వివరించారు. పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. 2024 ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి తాను, పవన్ కళ్యాణ్ ప్రజల వద్దకు వచ్చి రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నాడు హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రాన్ని నడిపిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓట్లు వృథా కాలేదని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు. చెప్పిన విధంగానే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని, జెట్ స్పీడ్‌తో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనే ఎన్డీఏ ప్రభుత్వ మంత్రమని పేర్కొన్నారు. సంక్షేమంలో తల్లికి వందనం, స్త్రీ శక్తి, సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. పేదలకు రూ.5కే అన్నం అందించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, తాము తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు, నేతన్నలు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, అమూల్ బ్రాండ్ స్థాయిలో స్వయం బ్రాండ్ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించనున్నానని చెప్పారు. వెలిగొండ ఫేజ్-2 పనులను కూడా పూర్తి చేసి.. ఉదయగిరి నియోజకవర్గాన్ని.. మార్కాపురం జిల్లాను సస్య శ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హంద్రీ-నీవా ద్వారా రాయలసీమ చివరి భూములకు నీరందిస్తున్నామని, పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లి ప్రాంతానికి నీటిని తీసుకెళ్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య, ఉద్యాన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

**మరింత సంక్షేమం... మరింత అభివృద్ధి**

విశాఖలో 28 వేల మందికి పైగా కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించామని, విజయవాడలో మరో 24 వేల మందికి పట్టాలు అందించనున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో మూడు లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పొట్టి శ్రీరాములు జలధార పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్ జీవన్ పనులను భారీ ఎత్తున ప్రారంభించబోతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించేలా వివిధ రంగాల్లో పరిశ్రమలను తీసుకొస్తూ ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. కృష్ణపట్నం-రామాయపట్నం పోర్టుల మధ్య దగదర్తి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రైల్-రోడ్ కనెక్టివిటిని పెంచి నెల్లూరు-ప్రకాశం జిల్లాలను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. బీపీసీఎల్ ప్లాంట్ ద్వారా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయని, డిఫెన్స్ పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి వస్తున్నాయని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు, ఉదయగిరి ప్రాంతవాసులు తిరిగి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదని, అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలదని అన్నారు. తమ అభివృద్ధిని చూసి సహకరించాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదైతే.. ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలదని సీఎం చెప్పారు.

**ఉదయగిరి సభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు...**

పల్లె పండుగ-3.0 కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని కీలక ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ.52 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 నిర్మాణానికి అవసరమైన రూ.85 కోట్లు అందిస్తామని తెలిపారు. డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన క్లియరెన్సులు మంజూరు చేస్తామని, సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్ సరఫరాకు సహకరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. క్రాకటూరు డిస్ట్రిబ్యూటరీకి నిధులను సమకూర్చడంతోపాటు... వింజమూరు ప్రాంత పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం రాజవోలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి.. బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి వీబీజీ రామ్‌జీ గ్రాంట్ అందిస్తామని చెప్పారు. కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా ఓలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కనిగిరి-బల్లిపల్లె వద్ద ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం కాకొల్లువారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శ్రమదానం చేశారు. 'వీబీ జీ రాంజీ' శ్రామికుల వద్దకు వెళ్లి పొలాల మధ్య డొంక రోడ్డు పనులను ప్రారంభించారు. కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలనించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 'వీబీ జీ రాంజీ' శ్రామికులతో కలసి సీఎం, డిప్యూటీ సీఎం, మాధవ్ గ్రూప్ ఫొటో దిగారు.

**ఆసక్తిగా ర్యాంప్ వాక్... ఆకట్టుకున్న ఏర్పాట్లు...**

సీఎం, డిప్యూటీ సీఎంలు సభా వేదిక మీదకు రాగానే సభికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. తమ మెళ్లో వేసుకున్న కండువాలను గాల్లో ఊపుతూ సభికులు స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్ మీద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని చూసి పలువురు మహిళలు ఆనందంతో డ్యాన్సులు చేశారు. ర్యాంప్ వాక్ చేసిన సీఎం, డిప్యూటీ సీఎంలను ఫొటోలు తీసేందుకు పలువురు సభికులు ప్రయత్నించారు. తమ కుర్చీల్లో నుంచి లేచి ఫోన్లల్లో ఫొటోలు తీసుకున్నారు. ఇక పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు చేశారు. మామిడి తోరణాలు, రంగవల్లులతో అతిధులకు, ప్రజలకు స్వాగత ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం కాకొల్లువారిపాలెం గ్రామంలో పల్లె పండుగ-3.0లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరిశీలించారు. గ్రామస్థులు వారికి పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గ్రామస్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామ్ నారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలు

చేపడుతున్న సంస్కరణలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలను ఆయన వివరించనున్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా ఆయన ఈ వేదికపై ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. తన పర్యటనపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "కొచ్చిలో అడుగుపెట్టిన నాకు తెలుగు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్‌లో పాల్గొంటుండడం సంతోషంగా ఉంది. దక్షిణాదిలో అవకాశాలను తీర్చిదిద్దడంపై జరిగే ఈ చర్చలో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కొచ్చిలో లోకేశ్ కు స్వాగతం పలికిన వారిలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ కూడా ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ, పారిశ్రామిక, విద్యా రంగ నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ విధానాలను, అభివృద్ధి నమూనాను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఇది ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుంది. ఈ సదస్సులో మంత్రి లోకేశ్ ప్రసంగంపై రాష్ట్రంలోని రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## రూ.35కే కేజీ ఉల్లిపాయలు

మార్కెట్ పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రులు తెలిపారు. ఉల్లిపాయల ధరల విషయంలో కూడా ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో సబ్సిడీ ధరకు విక్రయాలు చేపడుతున్నట్లు వివరించారు. విజయవాడలో ప్రారంభించే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందన, డిమాండ్‌ను బట్టి తదుపరి దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లకు విస్తరించి, సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రులు స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ కోరారు.

## మహిళలు అప్రమత్తం

బ్లాక్ చేసినా కొత్త నంబర్ల నుంచి పదేపదే కాల్స్ లేదా మెసేజ్‌లు రావడం కూడా స్టాకింగ్ కిందకే వస్తుందని వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే బహుమతులు, తమ ఫొటోలతో సృష్టించిన నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లు, వ్యక్తిగత ఫొటోల దుర్వినియోగంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వేధింపులకు గురైనప్పుడు సామాజిక అపవాదుకు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు లేదా కుటుంబసభ్యులకు తెలియజేయాలని శైలజ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య తీవ్రం కాకుండా నివారించవచ్చన్నారు. ఫిర్యాదు చేసే సమయంలో మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు, జీరో ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. వీటితో పాటు మానసిక ధైర్యం కూడా చాలా అవసరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 181 (మహిళా హెల్ప్‌లైన్), 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్) నంబర్లను, శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని ఆమె మహిళలకు సలహా ఇచ్చారు. ఇటీవల వైద్య విద్యార్థుల ఆత్మహత్యల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, విద్యాసంస్థలు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించి, కౌన్సెలింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు.

## ఈసీ, ఈవీఎంలపై నిందలేస్తారా?

సీడబ్ల్యూసీకి ఈవీఎంలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సర్ ప్రకియ వల్లే గెలిచామని కేరళ కాంగ్రెస్ నేతలు ప్రకటించిన విషయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మర్చిపోయిందా? అని నిలదీశారు. "మోదీ ఎందుకు రాజీనామా చేయాలి? మూడుసార్లు వరుసగా దేశ ప్రజలు అప్రతిహతంగా గెలిపించినందుకు రాజీనామా చేయాలా? దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనాన్ని, భారతీయుల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నందుకు రాజీనామా చేయాలా? మోదీ ప్రభుత్వాన్ని బ్రిటీష్ పాలనతో పోల్చడం హేయనీయం. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమే. సర్ సిబ్బంది అంతా రాష్ట్ర ప్రభుత్వ అధికారులే కదా? సర్‌లో పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునే వ్యవస్థ ఉంది. కేంద్రంపై నెపం నెట్టడం దుర్మార్గం. ఇటలీ మూలాలున్న కాంగ్రెస్ నేతలకు భారత ప్రజాస్వామ్యమంటే చులకన. సర్ కొత్త ప్రక్రియ కానేకాదు. గతంలోనూ నిర్వహించారు. సుప్రీంకోర్టు కూడా దీన్ని సమర్థించింది. ఎన్నికల్లో ఎవరు గెలవాలనేది ప్రజలు నిర్ణయిస్తారు. ఎన్నికల్లో ఎవరు ఓటు వేయాలనేది చట్టబద్ధమైన ఓటరు జాబితా నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనదైతే.. ఓటరు జాబితా కూడా అంతే పవిత్రంగా ఉండాల్సిందే. సర్ ప్రక్రియతో ఎన్నికల సంఘం చేసిన తప్పేమిటి? ఆధారాలుంటే బయటపెట్టండి" అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

## అమెరికా మాజీ సైనికులకు రష్యా ఎర

వెలుగులోకి వచ్చింది. వారిలో అమెరికన్లు కూడా ఉన్నారని.. సామాజిక మాధ్యమాల వేదికగా వారికి రష్యా ఎరవేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 26,000 డాలర్ల వరకు చెల్లిస్తామన్న హామీతో.. కనీసం 18 మంది అమెరికా జాతీయులను దళాల్లోకి తీసుకుందని తెలిపింది. వారిలో కొందరు మాజీ సైనికులు కూడా ఉన్నారని పేర్కొంది. యుద్ధ రంగంలో తమ వైపు పోరాడేందుకు వచ్చే అమెరికన్లకు 26వేల డాలర్ల సైనింగ్ బోనస్ (ఏకమొత్తంలో చెల్లించే ఆర్థిక ప్రోత్సాహకం), నెలవారీగా 2,000 డాలర్ల జీతం ఇస్తామని రష్యా తరఫున కొందరు ఏజెంట్లు ఎరవేస్తున్నారు. టిక్‌టాక్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేస్తూ.. పేదలు, అమెరికా వ్యతిరేక భావజాలం ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. అలా నియమితులైన వారిని యుద్ధరంగంలో ముందువరుసలో నిలబెడుతున్నారని.. దాంతో పలువురు రష్యా సైన్యంలో చేరిన కొంతకాలానికే ప్రాణాలు కోల్పోయారని ఉక్రెయిన్ నిఘా వర్గాలు వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది.

**రష్యాకు మరో 10,000 మంది ఉత్తర కొరియా సైనికులు: జెలెన్‌స్కీ**

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరఫున ఉత్తరకొరియా సైనికులు పోరాడుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వేలల్లో ఉత్తరకొరియా దేశీయులను రష్యాకు పంపినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా మరో 10వేల మంది సైనికులను పంపేందుకు కిమ్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. గతంలో కూడా జెలెన్‌స్కీ ఈ తరహా ప్రకటనలు చేశారు. 50,000 మంది వరకు ఉత్తర కొరియా సైనికులను రష్యాకు పంపే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. రష్యా దళాల తరఫున పోరాడుతున్న 135 దేశాలకు చెందిన 29వేల మందిని గుర్తించామని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. వాస్తవ లెక్కలు ఇంతకంటే ఎక్కువే ఉంటాయని చెప్తున్నారు.

## "నేను ఇరాన్‌కు ఏ హామీ ఇవ్వలేదు"

తక్కువ చేసి చూపించడానికే ట్రంప్ ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెట్టిందనే విమర్శలు వస్తున్నాయి. హర్మూజ్ జలసంధి సంక్షోభం, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో ఇరాన్ మరోసారి పరోక్ష చర్చలు జరిపిందని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ఈ చర్చలకు సంబంధించి అమెరికా స్పందన కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సమాధానం రావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 400 సీట్లు వచ్చేవి

మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త్ భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవలేకే కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పనిచేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**కేసులు పెరిగిన తర్వాత మేల్కొనడం కాదు.. ముందే గుర్తించి అడ్డుకోవాలి - ఒక్క మలేరియా మరణం కూడా జరగకూడదు - రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు స్పష్టీకరణ**

**సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యం, అలసత్వం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు అధికారులను హెచ్చరించారు. కేసులు పెరిగిన తర్వాత స్పందించడం అధికారుల పని కాదని.. కేసులు పెరగకుండా ముందే గుర్తించి అడ్డుకోవడమే బాధ్యత అని స్పష్టం చేశారు. ఒక్క మలేరియా కేసును కూడా తేలికగా తీసుకోవద్దని, ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అప్రమత్తతను మరింత పెంచాలని ఆదేశించారు. ముందస్తు నిఘా.. సత్వర పరీక్షలు.. సకాలంలో చికిత్స.. దోమల నియంత్రణ.. మందుల పూర్తి లభ్యత.. ఈ ఐదు అంశాల్లో ఎక్కడా లోపం ఉండకూడదని శ్రీ చక్రధరబాబు స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం జరిగిన 28 జిల్లాల అధికారుల రాష్ట్రస్థాయి కార్యశాలలో మలేరియా పరిస్థితి, వ్యాధుల నిఘా, క్షేత్రస్థాయిలో దోమల నియంత్రణ, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐహెచ్ఐపీ--ఐడీఎస్‌పీ సమాచారం, ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థల వినియోగం, క్రియాశీల--సాధారణ నిఘా, దోమల నియంత్రణ చర్యలు, మలేరియా నివారణ మందుల నిల్వలు, సిబ్బంది సామర్థ్య పెంపుపై చర్చించారు. ప్రతి జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలో కేసులు పెరుగుతున్నాయో ముందుగానే గుర్తించి, అక్కడ వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**కేసులు పెరిగే వరకు చూస్తే కుదరదు**

మలేరియా కేసులు పెరిగిన తర్వాత చర్యలు ప్రారంభించడం అంటే జాప్యమేనని కమిషనర్ స్పష్టం చేశారు. వ్యాధి వ్యాప్తికి సంబంధించిన తొలి సంకేతాలు కనిపించిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని ఆదేశించారు. సమాచారం అందిన తర్వాత కూడా చర్యలు తీసుకోకపోతే దాన్ని నిర్లక్ష్యంగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో జ్వర కేసులపై ప్రత్యేక నిఘా పెట్టాలని



ఆదేశించారు. జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని సూచించారు. మారుమూల ప్రాంతం కావడంతో కేసు ఆలస్యంగా గుర్తించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

**సమాచారం వస్తే.. వెంటనే చర్య ఉండాలి**

ఐహెచ్ఐపీ-ఐడీఎస్‌పీ ద్వారా అందుతున్న సమాచారాన్ని నిరంతరం పరిశీలించి, దాని ఆధారంగా ప్రమాద ప్రాంతాలను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి ముందస్తు నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మలేరియా కేసుల గుర్తింపులో క్రియాశీల, సాధారణ నిఘా రెండూ బలంగా ఉండాలని కమిషనర్ అన్నారు. కేసులను గుర్తించడంతో పాటు దోమల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలను వెంటనే, యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఏఎల్ఓ, ఐఆర్ఎస్, ఐఎస్ఎస్, పొగ పిచికారీ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పెరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కాదు.. కేసులు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి నియంత్రణ చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**మందులు లేకపోతే బాధ్యత ఎవరిది?**

మలేరియా పరిస్థితిని బట్టి మందుల అవసరాన్ని ముందుగానే అంచనా వేసి తగినంత నిల్వలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కేసు వచ్చిన తర్వాత మందుల కోసం వెతికే పరిస్థితి ఎంతమాత్రం ఉండకూడదని స్పష్టం చేశారు. మలేరియా నివారణ మందుల లభ్యత, నిల్వలపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్ష జరిగింది. కేటాయించిన నిధులను నిర్దిష్ట వ్యవధిలోగా వినియోగించాలని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికను సక్రమంగా రూపొందించకపోవడం వల్లే నిధుల వినియోగంలో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు.

**సిబ్బంది క్షేత్రస్థాయి పనితీరుపై అధికారులు నిఘా పెట్టాలి**

మలేరియా నియంత్రణలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, వారు క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. కాగితాలపై నివేదికలు కాకుండా.. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని స్పష్టం చేశారు. మలేరియాతో పాటు కాలాజార్, ఫైలేరియా వ్యాధుల వివరాలను కూడా పక్కాగా నమోదు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. సమాచారం, నివేదికల్లో జాప్యం చేయవద్దని, ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం బయటపడితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మలేరియా నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేదని, జాప్యాన్ని సహించేది లేదని కమిషనర్ శ్రీ కె.వి.ఎన్. చక్రధరబాబు స్పష్టం చేశారు. కేసులు పెరిగే వరకు వేచి చూడొద్దని.. ముందే గుర్తించాలి.. వెంటనే స్పందించాలి.. వ్యాధిని అక్కడికక్కడే అడ్డుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఒక్క మలేరియా మరణం కూడా జరగకుండా ప్రతి అధికారి, ప్రతి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని శ్రీ చక్రధరబాబు స్పష్టం చేశారు. సమావేశంలో ప్రజారోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డిప్యూటీ డైరెక్టర్ వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## తమ్మినేని దువ్వాడ చెట్టాపట్టాల్.. వైసీపీ ఏం చేయనుంది?

శ్రీకాకుళం జిల్లాలో రాజకీయ సామాజిక సమీకరణల మధ్య వైసీపీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఈ జిల్లాలో ఆధిపత్య కులాలను కో ఆర్డినేట్ చేసుకోవడంలో ఫ్యాన్ పార్టీ సతమతం అవుతోంది అని అంటున్నారు. టీడీపీ నాలుగు దశాబ్దాల రాజకీయంలో ఎపుడూ ఇలాంటి సమస్యలను ఎదుర్కోలేదు. వైసీపీ మాత్రం తన పదిహేనేళ్ల ప్రస్థానంలో సవాళ్ళు ఎదుర్కొంటోంది. నిజానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల దశాబ్దాలలో వెలమలది రాజకీయంగా ఆధిపత్యం కనిపిస్తోంది. అయినా సరే మిగిలిన సామాజిక వర్గాలను సైతం చేరదీస్తూ టీడీపీ ముందుకు సాగుతోంది. ఆ రకమైన అసంతృప్తి ఆయా కులాల మీద పడనీయకుండా జాగ్రత్త పడుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఈ సమీకరణలను సరి చేసుకున్నా ఓటమి తరువాత మాతం పట్టు చిక్కకుండా పోతోంది. ఫలితంగా బలమైన సామాజిక వర్గాల మధ్య పోరు కాస్తా రాజకీయ పోరుగా రూపుదిద్దుకోవడంతో వైసీపీకి జిల్లాలో తీరని నష్టం కలుగుతోంది అని అంటున్నారు.

**సీనియర్ మోస్ట్ లీడర్‌గా :** జిల్లా రాజకీయాలలో తమ్మినేని సీతారాం ని తక్కువ అంచనా వేయడానికి లేదు. ఆయన 1983లోనే గెలిచి వచ్చిన వారు. అంతే కాదు అయిదు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. రెండు సార్లు మంత్రిగా చేశారు. శాసనసభ స్పీకర్ గా అయిదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నారు. వీటికి మించి శ్రీకాకుళం జిల్లాలో బలమైన కాళింగ సామాజిక వర్గానికి ప్రతినిధిగా ఉన్నారు. గతంలో ఇదే జిల్లాలో బొడ్డేపల్లి రాజగోపాల్ వంటి నాయకులు కీలకంగా ఉండేవారు. ఆయన ఎన్నో సార్లు ఎంపీగా పనిచేశారు. ఇక ఇదే జిల్లాలో వెలమలు వర్సెస్ కాళింగులుగా రాజకీయం సాగిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక వెలమలకు ప్రాధాన్యత పెరిగింది. అదే సమయంలో కాంగ్రెస్ కాళింగులకు పెద్ద పీట వేసింది. వైసీపీ అయితే రెండు వర్గాలను దగ్గరకు తీసే క్రమంలో ఎక్కడో సమతూల్యత కొరవడింది అన్న భావన వల్లనే కాళింగులు ఇపుడు అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు.

**వరుస పరిణామాలు :** కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ని పార్టీ సస్పెండ్ చేయడం తమ్మినేనికి ప్రాధాన్యత తగ్గడం, మరో కీలక నేత కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సైతం ఈ సామాజిక ఆధిపత్య పోరుతోనే వైసీపీని వీడడం వంటి పరిణామాలతో ఆ సామాజిక వర్గంలో ఇపుడు చర్చ సాగుతోంది. వైసీపీకి దన్నుగా ఉంటూ వచ్చిన వారే ఇపుడు కొంత ఎడం పాటిస్తున్నారు. జిల్లాలో ధర్మాన సోదరులు చెప్పినట్లుగానే పార్టీ నడుస్తోంది అన్న భావన కాళింగ సామాజిక వర్గంలో ఉండడంతో పాటు అధినాయకత్వం వైపు నుంచి కూడా సరైన స్పందన లేదన్న ఆలోచనలు వారిలో కలుగుతున్నాయని అంటున్నారు.

**కొత్త రాజకీయం :** ఈ పరిణామాల నేపథ్యంలో ఇటీవల తమ్మినేని తనయుడు చిరంజీవి నాగ్ ధర్మాన సోదరుల మీద మీడియా ముఖంగానే విమర్శలు చేశారు. ఆ తరువాత అధినాయకత్వాన్ని తమ్మినేని సీతారాం కలిసి వచ్చారు. ఆయనకు ఎంపీగా పోటీ చేసే చాన్స్ ఇస్తామని హామీ లభించింది అని ప్రచారం సాగింది. ఈ పరిణామాలు ఇలా ఉండగానే వైసీపీ నుంచి సస్పెండ్ అయిన దువ్వాడ శ్రీనివాస్ తమ్మినేని చెట్టాపట్టాల్ వేయడం తో జిల్లా రాజకీయాల్లో కొత్త సమీకరణలకు ఆస్కారం ఉంటుందా అన్న చర్చ సాగుతోంది. ఇంకో వైపు దువ్వాడ శ్రీనివాస్ తిరిగి వైసీపీలో చేరుతారు అని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ధర్మాన సోదరుల మీద విమర్శలు చేసి పార్టీ నుంచి సస్పెండ్ అయిన దువ్వాడను తిరిగి చేర్చుకుంటే మరోసారి పార్టీలో వర్గ పోరు హెచ్చుతుందని కూడా అంటున్నారు. ఇవన్నీ చూస్తూంటే వైసీపీలో రాజకీయం సామాజికం కూడా రెండుగా చీలినట్లుగా కనిపిస్తోంది. మరి దీనిని వైసీపీ ఎలా సరిచేస్తుంది అన్నదే అంతా ఆసక్తిగా చూస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళ హత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. తనకు పరిచయమైన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లాడ్జికి తీసుకెళ్లిన ఓ వ్యక్తి.. ఆమెతో గొడవపడి దారుణంగా కొట్టి చంపాడు. ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం నాగసమందర్ గ్రామానికి చెందిన బేగరి శిరీష (34) నగరంలోని ఓ కస్టమర్ కేర్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఇదే జిల్లా తాండూరు మండలం ఓబులాపూర్‌కు చెందిన పాత నేరస్థుడు అవుసలపల్లి శ్రీనివాస్ (38)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. తనకు 2013లో వివాహం జరిగిందని, 2016లో భర్తతో విడాకులు తీసుకున్నట్లు శిరీష.. శ్రీనివాస్‌కు తెలిపింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన శ్రీనివాస్.. తరచూ ఆమెను వెంట తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 24న అర్ధరాత్రి ఇద్దరూ అమీర్‌పేటలోని గోకుల్ ప్రైడ్ ఓయో లాడ్జికి వచ్చారు. తప్పుడు ఆధార్ కార్డులు చూపించి గణేష్, దుర్గ పేర్లతో లాడ్జిలో నమోదు చేసుకున్నారు. మొదటి అంతస్తులోని 103వ గదిలో బస చేశారు. సెప్టెంబర్ 28వ తేదీ రాత్రి గదిలోనే శిరీషను శ్రీనివాస్ కొట్టి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో గది నుంచి బయటకు వెళ్లాడు. గది ఖాళీ చేస్తున్నానని చెప్పి రిసెప్షన్‌లో బిల్లు చెల్లించిన శ్రీనివాస్.. శిరీష ఉదయం 9 గంటలకు టిఫిన్ చేసి వెళ్లిపోతుందని చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం చాలాసేపటి వరకు గది తలుపులు తెరుచుకోకపోవడంతో లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చింది. కాలింగ్ బెల్ మోగించినా ఎలాంటి స్పందన రాకపోవడంతో డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లాడ్జి సిబ్బంది వద్ద ఉన్న మరో తాళంతో గది తలుపులు తెరిచి చూడగా.. శిరీష మంచంపై విగతజీవిగా కనిపించింది. ఆమె పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విజయవాడలో భారీ మోసం.. విశ్రాంత ఇంజినీర్‌కు రూ.10కోట్ల టోకరా

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీసుల పేరు చెప్పి విశ్రాంత ఇంజినీర్‌కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో రూ.10 కోట్లు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీర్‌కు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబరు వివిధ నేరాల్లో తమకు లభించిందని, మీపై కేసులు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత వీడియోకాల్ చేసి.. డిజిటల్ అరెస్టు చేసినట్టు బెదిరించారు. కేసుల నుంచి బయటపడాలంటే భారీగా డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో భయపడి పోయిన విశ్రాంత ఇంజినీర్.. సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు చేశారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంకు ద్వారా నాలుగు లావాదేవీల్లో.. నిందితులు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి రూ.10 కోట్లు డిపాజిట్ చేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు.. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితులకు సంబంధించిన రెండు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.7కోట్లు ఫ్రీజ్ చేశారు. విశ్రాంత ఇంజినీరు బ్యాంకులో తనకున్న ఫిక్స్‌డ్ డిపాట్ చేసిన నగదు తీసిమరీ సైబర్ నేరగాళ్లకు చెల్లించినట్టు సమాచారం.

## ఘట్‌కేసర్ వద్ద రైలు ఢీకొని సుమారు 300 గొర్రెలు మృత్యువాత



**ఘట్‌కేసర్, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య కొండమడుగు సమీపంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రైలు ఢీకొని సుమారు 300 గొర్రెలు మృతిచెందాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం అలీనగర్‌కు చెందిన కిష్టయ్య కొన్నేళ్లుగా వర్షాకాలంలో గొర్రెలను బీబీనగర్ సమీపంలో మేతకు తీసుకొస్తుంటారు. ఈ ఏడాది కూడా కొండమడుగు మెట్టు సమీపంలో మేపుతున్నారు. సోమవారం ఎప్పటిలాగే గొర్రెలను మేతకు తీసుకెళ్లి వచ్చాక రైలు పట్టాల పక్కన దొడ్లలో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు, అడవి పందులు బెదిరించడంతో భయపడిన సుమారు 600 గొర్రెలు.. రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాయి. అదే సమయంలో అటుగా వచ్చిన దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు వాటిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 300 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. కిష్టయ్యకు దాదాపు రూ.20లక్షల వరకు నష్టం వాటిల్లింది. తన జీవనాధారమైన గొర్రెలు మృతి చెందడంతో ఆయన కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం వివరాలు ఆరా తీశారు. బాధితుడిని పరామర్శించారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భాస్కర్ రావుతో ఫోన్‌లో మాట్లాడి.. బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## తిరుపతిలో విషాదం.. క్రేన్ కూలి ముగ్గురి మృతి

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలో విషాదం చోటుచేసుకుంది. భవన నిర్మాణానికి ఉపయోగించే క్రేన్ కూలి ముగ్గురు మృతిచెందారు. నగరంలోని డీబీఆర్ రోడ్డు ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతిచెందిన ముగ్గురినీ కూలీలుగా గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు








సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం

**రూరల్ నియోజకవర్గంలో 62 మంది లబ్ధిదారులకు రూ.44.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**27 మంది పట్టణ లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు అందజేత - ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో పేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం శాసన సభ్యులు నివాసంలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా పీఎంఏవై గృహ నిర్మాణ పథకం కింద 27 మంది పట్టణ ప్రాంత లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

**సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల వరకు సహాయం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం కలిగిన అర్హులైన పేదలు ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనూ భారీగా ఇళ్ల మంజూరు**

గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలకు మంజూరులు జరుగుతున్నాయని, త్వరలోనే వాటి నిర్మాణ పనులను ప్రారంభించి లబ్ధిదారులకు సొంత ఇళ్లను అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

**ప్రతి కుటుంబానికీ సొంతిల్లు లక్ష్యం**

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**కాలనీల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

గతంలో జగనన్న కాలనీల పేరుతో చేపట్టిన గృహ నిర్మాణాల్లో మౌలిక వసతుల కొరత కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం పల్లె పండుగ-3 కార్యక్రమం ద్వారా కాలనీల్లో రహదారులు, తాగునీరు, మురుగునీటి కాలువలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

**62 మందికి రూ.44.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ సహాయం**

కార్యక్రమంలో భాగంగా 62 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.44.30 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అందజేశారు. అనారోగ్యం, అత్యవసర వైద్య చికిత్స వంటి పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది.

**లబ్ధిదారుల కృతజ్ఞతలు**

రాజమహేంద్రవరం 18వ వార్డుకు చెందిన పాలిక వెంకట రమణ మాట్లాడుతూ, తన తల్లిదండ్రులు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆల్కట్ గార్డెన్స్‌కు చెందిన గుడ్ల వెంకటరమణ మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకోగా రూ.2.50 లక్షల సబ్సిడీ మంజూరైందని తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. పాలిక పద్మ మాట్లాడుతూ తన భర్త పాలిక శ్రీనివాసరావు అని, అత్తగారు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.2.50 లక్షలు మంజూరయ్యాయని, ఇందుకు ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలిపారు. వీరభద్రనగర్‌కు చెందిన యలక సంతోషి మాట్లాడుతూ, తమ అత్తగారికి మంజూరైన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ద్వారా రూ.2.50 లక్షల సహాయం అందిందని తెలిపారు. ఈ సహాయం అందించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

**బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం, ఉన్నత పదవుల్లో అవకాశాలు**

వెనుకబడిన, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో బలహీన వర్గాలకు చెందిన నాయకులకు ఉన్నత పదవులు, విశ్వవిద్యాలయాల ఉపకులపతి పదవులు, వివిధ సంస్థల పాలకమండళ్లలో అధ్యక్ష పదవులు, ఇతర కీలక బాధ్యతల్లో ఎంత మేరకు అవకాశాలు లభించాయో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ప్రజా ప్రభుత్వాలు బీసీ వర్గాలకు పెద్దపీట వేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం సహా పలు కీలక సంస్థలు, శాఖల్లో ఉన్నత స్థానాలు కల్పించి వారి నాయకత్వాన్ని ప్రోత్సహించిన విషయాన్ని గుర్తుచేశారు.

**బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు చర్యలు**

స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు గతంలో అమలైన 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించి, వారి చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలగకుండా పూర్తి రక్షణ కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, పారదర్శకమైన పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, హౌసింగ్ డి ఈ కె విజయ స్కంద, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వేమన నారాయణ గౌడ్, డైరెక్టర్ మద్దా మణి, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, రూరల్ మండల జనసేన అధ్యక్షులు చప్పా చిన్నరావు, గంగిన హనుమంతరావు, గట్టి సుబ్బారావు, ఉండవల్లి బంగార్రాజు, అడ్డాల శ్రీను, శీలం గోవింద్, రొంపిచర్ల ఆంటోనీ, వరగోగుల వెంకటేశ్వరరావు, గంగిన జాహ్నవి, జంగ వినోద్, మట్ట శ్రీను, పుక్కళ్ల రాజు, తాడేపల్లి నాగరాజు, కోరాడ వెంకటేష్, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, సురపరెడ్డి జానకిరామయ్య, మర్రెడ్డి రమేష్ పాతూరి రాజేష్, నాగిరెడ్డి రామకృష్ణ, చలమూరి సత్యనారాయణ, గుర్రపు సత్యనారాయణ, బూర దుర్గారావు, కొప్పిశెట్టి చిన్ని, చిట్టిబోయిన శ్రీనివాస్, కక్కల రమేష్, వడ్డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వెంటూరు పాఠశాలల యాజమాన్య కమిటీలు ఏకగ్రీవం



**రాయవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని వెంటూరు గ్రామంలో ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. హైస్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్‌గా మట్టపర్తి హరిబాబు, వైస్ చైర్మన్‌గా నున్న కాంతామణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 13 మంది సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల సక్రమంగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో రాణించేలా అవసరమైన సహకారం అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, గ్రామస్థుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సత్తిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే రిమ్మలపూడి వేణుగోపాలదొర, కొప్పిశెట్టి మాధవరావు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు గొడితి సత్యం, వల్లూరి వెంకట్రావు, దేవుళ్ల వెంకట్రావు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ నున్న ప్రదీప్ కుమార్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిరట్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన యాజమాన్య కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని వెంటూరు ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు కూడా ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ చైర్మన్‌గా టిల్లపూడి చంద్రశేఖర్, వైస్ చైర్మన్‌గా పులిదిండి ఇందిర ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో ఏడుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

# గర్భిణులకు శ్రీమంతాలు.. అంగన్‌వాడీ సిబ్బందికి సత్కారం

**వెంటూరులో ఘనంగా పోషణ మాసోత్సవాలు**



**రాయవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలం వెంటూరు గ్రామంలో మంగళవారం పోషణ మాసోత్సవ కార్యక్రమం, అంగన్వాడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భస్థ శిశు దశ నుంచే పోషకాహారం ప్రాధాన్యతను గుర్తించి, చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్యం, తల్లుల ఆరోగ్య పరిరక్షణకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని కార్యక్రమంలో వివరించారు. మనిషి జీవితంలోని ప్రతి దశలోనూ పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే పోషణ మాసోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం అంగన్వాడి కార్యకర్త, అంగన్వాడి సహాయకురాలు, ప్రీస్కూల్ విద్యార్థి తల్లిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిమ్మలపూడి వేణుగోపాల్ దొర, కొప్పిశెట్టి మాధవరావు, నున్న ప్రదీప్ కుమార్, గొడితి సత్యం, చీరట్ల సుబ్బారావు హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, హెల్త్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు మంచి నడవడికతో చదువుకుని**

# భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి



**గోకవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం తంటికొండ గ్రామంలోని సంజీవనగరం ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోక వినోద్ కుమార్, వైస్ చైర్మన్ సాలి యేసురత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతిపై వారు ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికను అలవర్చుకుని విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో తమ గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలని, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పసలపూడిలో పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు ఏకగ్రీవం



**రాయవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో పసలపూడి గ్రామంలోని పలు పాఠశాలలకు నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా ముగిశాయి. గ్రామ పరిధిలోని నాలుగు పాఠశాలల చైర్మన్లుగా కిందివారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సి.హెచ్.ఎస్.ఆర్. జడ్పీహెచ్ స్కూల్: శ్రీ తౌటిక వెంకటేశ్వరరావు, ఎంపీపీ మెయిన్ స్కూల్ శ్రీ పోతంశెట్టి పాపారెడ్డి, న్యూ కాలనీ స్కూల్ శ్రీమతి పులగం లావణ్య, నరాలవారి పాలెం స్కూల్ శ్రీ మేడిశెట్టి వెంకటరమణ ఈ సందర్భంగా ఎన్నికైన నూతన చైర్మన్లను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఏకగ్రీవ ఎన్నిక అనేది నూతన పాలకమండలిపై గ్రామీణులు, తల్లిదండ్రులు ఉంచిన నమ్మకానికి ప్రతీక అని పలువురు కొనియాడారు. నూతన నాయకత్వంలో పాఠశాలల మౌలిక వసతులు మెరుగుపడి, విద్యార్థుల భవిష్యత్తుకు మరియు పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి మరిన్ని మంచి కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**సీతానగరం మండలం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం**



**సీతానగరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు వీఆర్ఏల కనీస భవిష్యత్తు కోసం ఈనెల 16వ తారీకు నుండి 14 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకులు అనగా వీఆర్ఏలు సహాయ నిరాకరణ శాంతియుత ధర్నాలు అనేక రీతులుగా చేస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం కనీసం స్పందించి ఇప్పటివరకు హామీ ప్రకటించలేదు. ప్రభుత్వానికి తెలియలేదో లేక వి ఆర్ ఎ లతో ప్రభుత్వానికి పనులేదోఅర్థం కావడం లేదు. సగటు మనిషి కూలి పని చేసుకునేవాడైన రోజుకి కనీసం 600 రూపాయలు సంపాదిస్తున్నాడు వాళ్లు 11 గంటల వరకు పనిచేసే సుమారు 300 పైగా తీసుకుంటున్నారు. మేము రాష్ట్రవ్యాప్తంగా సుమారు 19 మందికి పైగా కేవలం రూ 10,500 లు మాత్రమే గౌరవ వేతనం తీసుకుంటున్నాము. మా పై అధికారులు కార్యాలయం విడిచి వెళ్ళు వరకు సమయ పాలన లేకుండా అహర్నిశలు కష్టపడుతూ అనధికారిక డ్యూటీలు, దూరప్రాంతాలకు డ్యూటీలు రాత్రివేళ డ్యూటీలు చేస్తూ ఈ చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం ఈ ప్రస్తుత కాలంలో ఎవరికైనా కష్టమే. మాకు కనీస వేతనం ఇవ్వాలని, అనధికారంగా చేస్తున్న ఉద్యోగాలు ప్రమోషన్ ద్వారా ఇవ్వాలని నామినీలుగా చేస్తున్న వీఆర్ఏలను పర్మినెంట్ చేయాలని కారుణ్య నియామకాలు కొనసాగించాలని ప్రభుత్వాన్ని వేడుకొంటున్నాము ఏడు సంవత్సరాల నుండి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాము. మా కోరికలు గొంతేమో కోరికలు కాదు. ప్రభుత్వం తీర్చలేని కోరికలు కాదు. కాబట్టి ప్రభుత్వాలు మా పైన దయవుంచి మేము




విశ్వవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

బుధవారం, 30 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com





## వివాదాలకు తావులేకుండా

# న్యాయం జరిగేలా సత్వర చర్యలు

**సహజ వనరుల నుంచి రొయ్య పిల్లల సేకరణపై చట్టపరమైన నిబంధనల మేరకు చర్యలు**

**జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** వివాదాలకు తావులేకుండా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, మత్స్యశాఖ అధికారులు, ధవళేశ్వరం బోట్‌మెన్ అండ్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులతో సహజ వనరుల నుంచి రొయ్య పిల్లల సేకరణకు సంబంధించిన వివాదం, లభ్యత, ఆదాయం, సేకరణ నిబంధనలు, రాష్ట్రస్థాయి కమిటీ సిఫారసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధవళేశ్వరం ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాలకు చట్టపరమైన నిబంధనల మేరకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహజ వనరుల నుంచి రొయ్య పిల్లల సేకరణకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి, ఎటువంటి వివాదాలకు తావులేకుండా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో సహజంగా లభించే రొయ్య పిల్లల సంతానోత్పత్తి, సేకరణ విధానం, లభ్యత తదితర వివరాలను మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రొయ్య పిల్లల సేకరణ, విక్రయాలు, వాటి ద్వారా వచ్చే ఆదాయం తదితర అంశాలపై మత్స్యకార సొసైటీ ప్రతినిధులతో వివరాలను తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరం గోదావరి నది ప్రవాహ పరిస్థితులు, అనుకూలతలను బట్టి రొయ్య పిల్లల సేకరణ చేపడుతున్నట్లు సొసైటీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ధవళేశ్వరం బ్యారేజీ పరిధిలోని గేట్లకు సంబంధించిన వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ పరిధిలోని నిర్దిష్ట ప్రాంతాల్లో రొయ్య పిల్లల సేకరణ జరుగుతున్నట్లు మత్స్యకార సొసైటీ ప్రతినిధులు తెలిపారు. రొయ్య పిల్లల సేకరణ ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడి సుమారు 500 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని సొసైటీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధవళేశ్వరం మత్స్యకార సొసైటీ ప్రతినిధులు ప్రభుత్వం నుంచి లీజు తీసుకుని రొయ్య పిల్లల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. బొబ్బర్లంక మత్స్యకారుల వైఖరి తమపై ప్రభావం చూపుతోందని, ఇరు ప్రాంతాల మత్స్యకార కుటుంబాలకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అక్వాకల్చర్ సీడ్ యాక్ట్-2020, జి.ఓ.ఎం.ఎస్. నం.46, రూల్ 8(1) ప్రకారం రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేసి, ధవళేశ్వరం, బొబ్బర్లంక ప్రాంతాలకు చెందిన మత్స్యకార కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల మేరకు సత్వర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సహజ వనరుల నుంచి లభించే రొయ్య పిల్లల పరిరక్షణతో పాటు వాటి సహజ సంతానోత్పత్తికి ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని ఆదేశించారు. అన్ని వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, వివాదాలకు తావులేకుండా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కె. కరుణాకర్ రావు, కాకినాడ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ అధికారిణి కె. శ్రావణి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సి.హెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నాటికి పరిశోధనా గ్రంథాల ఆవిష్కరణ

**తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్రపై విస్తృత పరిశోధనలకు వేదిక**

**ప్రతి నెలా ప్రత్యేక సదస్సులు.. నిపుణుల సమీక్ష అనంతరం గ్రంథాలుగా ప్రచురణ : ఉపాధ్యక్షులు ఆచార్య డి.మునిరత్నం నాయుడు**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కేంద్రంగా తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ముందడుగు వేస్తోందని విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు తెలిపారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని గోదావరి నది చరిత్ర, తెలుగు భాషా సాహిత్యాలు, కళలు, చరిత్ర, సంస్కృతి, నదీ పరివాహక ప్రాంత ప్రాశస్త్యం తదితర అంశాలపై సమగ్ర పరిశోధనా గ్రంథాలను రూపొందించి పుష్కరాల సమయంలో ఆవిష్కరించేందుకు కార్యాచరణ ప్రారంభించామని చెప్పారు. బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారం 'రాజమహేంద్రవరం సాహితీ వైభవం' పేరుతో ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య డి. మునిరత్నం నాయుడు మాట్లాడుతూ.. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఐదు నెలలపాటు ప్రతి నెలా ఒక ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల ద్వారా గోదావరి ప్రాంతానికి సంబంధించిన చరిత్ర, సాహిత్యం, కళలు, సంస్కృతి తదితర అంశాలపై విలువైన పరిశోధనా సమాచారాన్ని సేకరించనున్నట్లు చెప్పారు. నేటి సదస్సుకు 25 మంది పరిశోధకులు పత్ర సమర్పకులుగా పేర్లు నమోదు చేసుకున్నారని, రెండు సమాంతర సమావేశాల ద్వారా పరిశోధనా పత్రాల సమర్పణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సదస్సుల్లో సమర్పించే పరిశోధనా వ్యాసాలను నిపుణుల కమిటీ ద్వారా సమీక్షించి, వాటిలో ప్రామాణికమైన పరిశోధనలను ఎంపిక చేసి గ్రంథాలుగా రూపొందిస్తామని చెప్పారు. ఈ గ్రంథాలను 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరం ప్రధాన కేంద్రంతో పాటు శ్రీశైలం, కూచిపూడి ప్రాంగణాల్లో విశ్వవిద్యాలయానికి సంబంధించిన కోర్సులు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ పరిధిలో ప్రాచుర్యం పొందిన 26 విభాగాలకు చెందిన పలు ముఖ్యమైన కోర్సులను రాజమహేంద్రవరం కేంద్రంలో కూడా ప్రవేశపెట్టేందుకు సిలబస్ రూపకల్పన పూర్తిచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి చేపడుతున్న ఈ కార్యక్రమాల్లో పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు విస్తృతంగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని గోదావరి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాలపై విస్తృత పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించేందుకు వరుసగా జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. పరిశోధకులు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**తెలుగు సంస్కృతికి పునాది రాజమహేంద్రవరం**

విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మునుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతికి రాజమహేంద్రవరం పునాదిగా నిలిచిందన్నారు. స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు ఆశయాలతో ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మానవుడు శబ్దాలు, సైగల ద్వారా భావవ్యక్తీకరణ చేసుకున్న ప్రాచీన కాలం నుంచి నేటి సాంకేతిక యుగం వరకు నదీ లోయలు మానవ నాగరికత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. మహారాష్ట్రలో జన్మించి అంతర్వేది వద్ద సముద్రంలో కలిసే వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఘనమైన చరిత్ర, సంస్కృతి, సాహిత్య వారసత్వాన్ని కలిగి ఉందన్నారు.

సదస్సులో .. డా. ఎన్. సుజాత – కందుకూరి వీరేశలింగం అంశంపై ప్రసంగిస్తూ, తెలుగు సమాజంలో సంస్కరణోద్యమానికి కందుకూరి వీరేశలింగం అందించిన సేవలను వివరించారు. స్త్రీ విద్య, వితంతు వివాహం, బాల్యవివాహాల నిర్మూలన, సామాజిక చైతన్యం వంటి అంశాల్లో ఆయన చేసిన కృషి తెలుగు సమాజంపై చెరగని ముద్ర వేసిందన్నారు.

పేపకాయల ప్రసాద్ – నన్నయ అంశంపై మాట్లాడుతూ, తెలుగు ఆదికవి నన్నయ తెలుగు భాషకు, సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలను వివరించారు. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించడం ద్వారా తెలుగు సాహిత్యానికి పటిష్టమైన పునాది వేశారని పేర్కొన్నారు.

జంధ్యాల శరత్ బాబు – శ్రీనాథుడు అంశంపై ప్రసంగిస్తూ, ప్రబంధ కవిత్వంలో శ్రీనాథుడి ప్రత్యేక స్థానాన్ని వివరించారు. ఆయన రచనల్లో కనిపించే భాషా వైభవం, అలంకార ప్రయోగం, కవితా పటిమ తెలుగు సాహిత్యానికి విశిష్ట సంపదగా నిలిచాయని తెలిపారు.

ద్రోణావజఝుల ముక్తేశ్వర్ – కందుకూరి రాజ్యలక్ష్మమ్మ అంశంపై మాట్లాడుతూ, సాహిత్య, సామాజిక రంగాల్లో ఆమె పాత్రను వివరించారు. కందుకూరి కుటుంబం ద్వారా కొనసాగిన సామాజిక చైతన్యంలో రాజ్యలక్ష్మమ్మ సేవలు, మహిళల అభ్యున్నతికి సంబంధించిన ఆలోచనలను ప్రస్తావించారు.

రెండవ సమావేశం

డా. తలారి వాసు – మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి అంశంపై ప్రసంగిస్తూ, తూర్పుగోదావరి సాహిత్య సంప్రదాయంలో మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి స్థానం, రచనా వైశిష్ట్యాన్ని వివరించారు. సంప్రదాయ సాహిత్య విలువలను కాపాడుతూ తెలుగు భాషా వైభవాన్ని తన రచనల ద్వారా చాటారని పేర్కొన్నారు.

షేక్ జరీనాబేగం – కవుల కలాల్లో గోదావరి అంశంపై మాట్లాడుతూ, గోదావరి నది తెలుగు కవుల సాహిత్యంలో పొందిన విశిష్ట స్థానాన్ని వివరించారు. నదీ ప్రవాహం, ప్రకృతి సౌందర్యం, ప్రజల జీవన విధానం, సంస్కృతి, ఆధ్యాత్మికత వంటి అంశాలు కవుల రచనల్లో గోదావరితో ముడిపడి ప్రతిబింబించాయని తెలిపారు.

డా. ఎ. వెంకటేశ్వర్లు – గుడిపాటి వెంకటాచలం అంశంపై ప్రసంగిస్తూ, చలం రచనల్లో కనిపించే వ్యక్తి స్వేచ్ఛ, స్త్రీ చైతన్యం, సామాజిక ప్రశ్నలను వివరించారు. సంప్రదాయ భావజాలాన్ని ప్రశ్నిస్తూ తెలుగు సాహిత్యంలో కొత్త ఆలోచనా ధోరణికి చలం చేసిన కృషిని ప్రస్తావించారు.

డా. గూటం స్వామి – కవికొండల వెంకటరావు, కుసుమ ధర్మన్న అంశాలపై మాట్లాడుతూ, గోదావరి ప్రాంత సాహిత్య వికాసంలో వీరి పాత్రను వివరించారు. సామాజిక స్పృహ, మానవీయ విలువలు, ప్రజా జీవన ప్రతిబింబం వారి రచనల్లో ప్రధానంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.

మూడవ సమావేశం

డా. జోస్యుల కృష్ణబాబు – శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి అంశంపై ప్రసంగిస్తూ, తెలుగు సాహిత్యంలో ఆయన రచనా ప్రతిభ, పాండిత్యాన్ని వివరించారు. సాంప్రదాయ సాహిత్యాన్ని అభివృద్ధి చేయడంలో, తెలుగు భాషా వైభవాన్ని విస్తరించడంలో ఆయన చేసిన కృషిని ప్రస్తావించారు.

అవధానుల మణిబాబు – శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అంశంపై మాట్లాడుతూ, ఆయన సాహిత్య కృషి, కథా రచనా వైశిష్ట్యాన్ని వివరించారు. సమాజంలోని జీవన వాస్తవాలను సాహిత్య రూపంలో ప్రతిబింబించిన తీరు ప్రత్యేకమైనదని పేర్కొన్నారు.

డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు – తెలుగు వాగ్గేయకారులు అంశంపై ప్రసంగిస్తూ, తెలుగు సంగీత సాహిత్య సంప్రదాయాన్ని సుసంపన్నం చేసిన వాగ్గేయకారుల సేవలను వివరించారు. సాహిత్యం, సంగీతాన్ని సమన్వయం చేసి భక్తి, భావం, భాషా సౌందర్యాన్ని ప్రజలకు చేరువ చేసిన వారి పాత్రను వివరించారు.

భమిడిపాటి గౌరీశంకర్ – భమిడిపాటి కామేశ్వరరావు అంశంపై మాట్లాడుతూ, హాస్య రచనకు ఆయన అందించిన విశిష్ట సేవలను వివరించారు. సామాజిక జీవితంలోని విరుద్ధతలను హాస్యంతో, వ్యంగ్యంతో చూపిస్తూ తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారని పేర్కొన్నారు.

డా. మద్దాల పెద్దిరాజు – స్మైల్ అంశంపై ప్రసంగిస్తూ, హాస్యం, చిరునవ్వు మనిషి జీవన విధానంలో కలిగించే సానుకూల ప్రభావాన్ని వివరించారు. సాహిత్యంలో హాస్యభావన సామాజిక సందేశాన్ని సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లగల సాధనంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నాల్గవ సమావేశం

ఎం.ఎస్. సూర్యనారాయణ – బేతవోలు రామబ్రహ్మం అంశంపై మాట్లాడుతూ, ఆయన సాహిత్య సేవలను, రచనల్లోని సామాజిక స్పృహను వివరించారు. గోదావరి ప్రాంత సాహిత్య వాతావరణంలో ఆయన రచనలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు.

డా. శ్రీపురుషోత్తం గణపతిరావు – నేదునూరి గంగాధరం అంశంపై ప్రసంగిస్తూ, ఆయన సాహిత్య కృషి, రచనా ప్రత్యేకతలను వివరించారు. తెలుగు భాషా సాహిత్య అభివృద్ధికి ప్రాంతీయ రచయితలు అందించిన సేవలను గుర్తుచేశారు.

ఊటుకూరి వరప్రసాద్ – ఎండ్లూరి సుధాకర్ అంశంపై మాట్లాడుతూ, సామాజిక చైతన్యం, సమకాలీన జీవన సమస్యలను సాహిత్యంలో ప్రతిబింబించిన ఆయన రచనా ధోరణిని వివరించారు. ప్రజల జీవితాలకు దగ్గరగా ఉండే భావవ్యక్తీకరణ ఆయన రచనల ప్రత్యేకతగా పేర్కొన్నారు.

డా. టి. ఆశీర్వాదం – గోదావరి జిల్లా కవులు అంశంపై ప్రసంగిస్తూ, గోదావరి ప్రాంతం తెలుగు సాహిత్యానికి అందించిన కవులు, రచయితల సేవలను వివరించారు. గోదావరి ప్రకృతి, సంస్కృతి, ప్రజాజీవనం ఈ ప్రాంత కవిత్వానికి నిరంతర ప్రేరణగా నిలిచాయని తెలిపారు.

డా. కె.వి. రామకృష్ణ – అడవి బాపిరాజు అంశంపై మాట్లాడుతూ, చిత్రకళ, సాహిత్యం, చరిత్ర, సంస్కృతిపై బాపిరాజుకు ఉన్న ఆసక్తిని వివరించారు. ఆయన నవలలు, కథలు, కళా సృజనలో కనిపించే సౌందర్య దృష్టి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించిందన్నారు.

డా. మునుగు శ్రీనివాసరావు – గోదావరి సాహిత్య వైభవం అంశాన్ని ప్రస్తావిస్తూ, గోదావరి నది చుట్టూ వికసించిన సాహిత్య, సాంస్కృతిక సంప్రదాయాలను వివరించారు. అనేక తరాల కవులు, రచయితలకు గోదావరి స్ఫూర్తినిచ్చిందని, ఈ ప్రాంత సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నిక



**రావులపాలెం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధి పొడగట్లపల్లి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ మోనిటరింగ్ కమిటీ(ఎస్ఎంసి)ల ఎన్నిక హెచ్ఎం వి.శేషుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా గండి శ్రీను, ఉపాధ్యక్షుడుగా అత్తిలి సూర్యప్రకాష్ ఎన్నికైయ్యారు. కోఆప్టెడ్ సభ్యులుగా అల్లూరి పెదక్రృష్ణంరాజు,వీటి రాంబాబు సభ్యులు గా 15 మంది పేరెంట్స్ ఎన్నికయ్యారు.అనంతరం పలువురు మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధిలో వారంతా కీలకపాత్ర పోషిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఆకాంక్షించారు. అలాగే పలువురు కూటమి నాయకులు స్థానికంగా ఎన్నికైన కమిటీలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో శ్రీఉప్పలపాటి జానకియమ్మ అన్నదా సత్రం చైర్మన్ గోపిశెట్టి సత్తిపండు,జనసేన జిల్లా నాయకులు దొంగ సుబ్బారావు, కూటమి నాయకులు మంచే వెంకటేశ్వరరావు, అంబటి కిషోర్, సఖినాల గణపతి, కుడుపూడి వెంకటేశ్వర్లు, వీటి రాజు, చిలకమర్తి శివక్రృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు**

## ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుభాభినందనలు

**నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎన్నికైన ఎన్డీఏ కూటమి మద్దతుదారులకు అభినందనలు**



**కొత్తపేట, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లోని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులందరికీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచడం వంటి అంశాలపై కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొత్తపేట, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ది.30.09.2026 బుధవారం నాడు ఆర్‌డిఎస్ఎస్ పథకంలోని అభివృద్ధి పనులలో భాగంగా కొత్త 3 ఫేజ్ 11కెవి లైన్ ఏర్పాటు చేయు నిమిత్తం రావులపాలెం మండలం లోని పొడగట్లపల్లి మరియు లక్ష్మీపోలవరం గ్రామాలకు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 04.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కావున వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించగలరని కోరుతున్నాము అని కొత్తపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు తెలియజేశారు.

**వన్నెచింతలపూడి జెడ్పీ హైస్కూల్**

## విద్యా కమిటీ చైర్మన్‌గా దుర్గా భవాని



**అమలాపురం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ నూతన చైర్మన్‌గా పరమట దుర్గా భవాని, వైస్ చైర్మన్‌గా మోకా వెంకన్నబాబు ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికల ప్రక్రియలో వీరి ఎన్నిక జరిగింది. చైర్మన్ పదవి టీడీపీకి దక్కేలా కూటమి నాయకులు ప్రయత్నాలు చేసినప్పటికీ, ఎన్నికల ప్రక్రియలో పరమట దుర్గా భవాని చైర్మన్‌గా ఎన్నిక కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. దుర్గా భవాని వైఎస్సార్‌సీపీ నాయకుడు పరమట మాణిక్యాలరావు భార్య కావడంతో ఈ ఎన్నికకు రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. విద్యా కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక అనంతరం పలువురు వారికి అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరమట బీమా మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిదిండి బాబు, కుంచె వెంకటేశ్వరరావు, సదాశివుడు, ముత్యాలు బాబు, రేవు జగదీష్ తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

## లేఅవుట్లకు ప్లాన్ అప్రూవల్ తప్పనిసరి

**కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో అన్ని లేఅవుట్లకు ప్లాన్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. మంగళవారం ఉదయం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. గాదాలమ్మనగర్లో పలు లేఅవుట్లను పరిశీలించారు. ఎక్కడ ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు జరగకూడదని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా రోడ్లు, కాలువలు, నీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతనే లేఅవుట్లలో నిర్మాణాలు జరగాలన్నారు. అలాగే అనధికార లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా మోసాలకు గురికాకుండా ఉండటానికి అన్ని అనుమతులు ఉన్న ప్రాజెక్టుల్లోనే స్థలాలను కొనుగోలు చేయాలని.. తక్కువ ధరకు ఇచ్చారనో, ఆఫర్లలో వచ్చిందనో కొంటే తర్వాత ఇబ్బందులు పడతారన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఏసీపీ కొండలరావు, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.



పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు

# విద్యా కమిటీలు కృషి చేయాలి

## నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్‌లను అభినందించిన ఎమ్మెల్యే







**కోటనందూరు, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలలో చైర్మన్ వైస్ చైర్మన్ లగా ఎన్నికైన అందర్నీ ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే యనమల దివ్య శు భాకాంక్షలు తెలియజేశారు. వీరు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని మానవనుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా విధానంలో పెను మార్పులు తీసుకొస్తున్నారని అందుకు అనుగుణంగా విద్యా కమిటీలు పని చేసి పాఠశాలలను అభివృద్ధి పదములో నడిపించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కోటనందూరు మండలంలో ఎస్ఎంసి ఎన్నికలలో ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్ లను జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గాడి రాజబాబు, మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ పోతల సూరిబాబు, కోపరేటివ్ చైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావు, తుని నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు తదితరులు నాయకులు నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైర్మన్ గా చందక శ్రీను, వైస్ చైర్ పర్సన్ గా బడుగు విక్టోరియా రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు కే ఎస్ వి సత్యనారాయణ, పల్లి రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తల్లిదండ్రులు సత్కరించారు. అల్లిపూడి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో జరిగిన ఎన్నికలలో చైర్మన్గా బత్తి ఉమా వైస్ చైర్ పర్సన్ గా దారకొండ సింహాచలం ఎన్నికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ సిహెచ్ రాజేశ్వరి తదితరులు అభినందించారు. తిమ్మరాజుపేట ఎంపీపీ స్కూల్లో జరిగిన ఎన్నికల్లో చైర్మన్గా పంపన కళ్యాణ్, వైస్ చైర్ పర్సన్ గా బర్ల సీత ఎన్నికయ్యారు వీరిని ప్రధానోపాధ్యాయుడు తోపాటు బర్ల వెంకి నాయుడు బర్ల నరసింహామూర్తి తదితరులు అభినందించారు.

# బిజెపి పాలనలో ప్రజాస్వామ్యానికి పాతర

## ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతపై అఖిలపక్ష ధ్వజం - సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్

## ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ప్రతి పేరుకు లెక్క చెప్పాలి - అక్టోబర్ 2న కంబాలచెరువు దండి మార్చ్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్ష

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను కాపాడుకోవాల్సిన తరుణమిదని అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఎన్నికల కమిషన్ నియామక విధానంలో మార్పులు, ఓటర్ల జాబితా సవరణ పేరుతో భారీగా పేర్ల తొలగింపు, ఈసీఐనెట్ ద్వారా అధికారాల కేంద్రీకరణ, ఈవీఎంలు--వీవీప్యాట్‌పై అనుమానాలు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను వక్తలు తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరని పేర్కొన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలోని కృష్ణ సాయి కల్యాణ మండపంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టి.అరుణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద దండి మార్చ్ విగ్రహాల వద్ద అఖిలపక్షాల ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. అహింసా మార్గంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడాలని అన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శించే సోషల్ మీడియా పోస్టులతో సహా సుమారు 1.75 లక్షల పోస్టులను నిలిపివేయాలని కేంద్రం ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. భావప్రకటనా స్వేచ్ఛకు ఇది విఘాతమని పేర్కొన్నారు.ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థపైనా అరుణ్ ప్రశ్నలు లేవనెత్తారు. 2023 చట్టం ద్వారా నియామక కమిటీలో వచ్చిన మార్పులతో కేంద్ర ప్రభుత్వ ప్రభావం పెరిగిందని విమర్శించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను బలోపేతం చేసేందుకు ప్రధాన న్యాయమూర్తి పాత్రను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ల నియామక విధానాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్ణయాలపై 14 సందర్భాల్లో లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనాన్ని ఉటంకించారు. సెప్టెంబర్ 26న ముగ్గురు కమిషనర్లు కలిసి నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో గతంలో వ్యక్తమైన అభ్యంతరాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో పాత విధానాన్ని పునరుద్ధరించేలా పార్లమెంట్‌లో చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలను బీఎల్‌ఓలు, ఈఎల్‌ఓలు, ఈఆర్‌ఓల స్థానిక పరిధిలోనే ఉంచాలని అన్నారు. ఫారం-6లో మార్పులకు కారణాలను ఎన్నికల సంఘం ప్రజలకు వివరించాలని కోరారు. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించిన ప్రతి సందర్భానికి కారణాన్ని ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రత్యేక ప్రజా డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. పేరు తొలగింపుపై అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలని, అప్పీళ్లు పరిష్కారం కాకముందే ఎన్నికలు నిర్వహించకుండా తగిన విధానం రూపొందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రభుత్వ



సంస్థలను అధికార పార్టీ ప్రయోజనాలకు వినియోగించకూడదన్నారు. 2019, 2024 ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిందని ఆమె ఆరోపించారు. జి వి సుందర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారన్న నేపథ్యంలో మృతులు, డూప్లికేట్ నమోదులు, ఇతర ప్రాంతాలకు తరలిపోయినవారు, అర్హత ఉన్నప్పటికీ జాబితా నుంచి తొలగించబడినవారి వివరాలను విడివిడిగా ప్రజలకు వెల్లడించాలని కోరారు. యువ ఓటర్లకు ఫారం--6 ప్రక్రియను సులభతరం చేయాలని, ఎన్నికల సాఫ్ట్‌వేర్‌ను ఐఐటీ వంటి స్వతంత్ర సంస్థలతో ఆడిట్ చేయించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలని, ఎన్నికల సంస్థలు రాజకీయ జోక్యానికి అతీతంగా పనిచేయాలని పేర్కొన్నారు. సిపిఐ నగర కార్యదర్శి కొండలరావు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎన్నికల వ్యవస్థపై ప్రభావం పెంచుకుంటున్నాయని కొందరు వక్తలు చేసిన ఆరోపణలను సమావేశంలో ప్రస్తావించారు. ఇవి ఆయా వక్తలు చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటికి స్వతంత్ర ధ్రువీకరణ అవసరమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నగర నాయకుడు బాలేపల్లి మురళి ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలో సంస్కరణలు చేపట్టాలని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి పవన్ మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థలను రాజకీయ నియంత్రణలోకి తీసుకువస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుందని వక్తలు పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయులు వి ఎస్ ఎస్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటు హక్కు, ఓటర్ల జాబితాలో పారదర్శకత, ఎన్నికల సాంకేతిక వ్యవస్థలపై ప్రజా విశ్వాసం వంటి అంశాలపై అఖిలపక్షాలు కలిసి పోరాడాలని సమావేశం నిర్ణయించిందని అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రాపు రాంబాబు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కే జోజి సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ ఎస్ మూర్తి ఎఐటియుసి సీనియర్ నాయకులు నల్ల రామారావు మహిళా కాంగ్రెస్ నాయకులు ఆకుల భాగ్యలక్ష్మి సింధ్యరాణి తదితరులు మాట్లాడారు రౌండ్ టేబుల్ సమావేశాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యురాలు పి తులసి వందన సమర్పణ చేసి ముగించారు. అక్టోబర్ 2న కంబాలచెరువు దండి మార్చ్ విగ్రహాల వద్ద జరిగే సత్యాగ్రహ దీక్షలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు.

# అక్టోబర్ 17న అమరావతిలో జరిగే జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

## ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ గోకవరం మండల ముఖ్య నాయకుల సమావేశం



**గోకవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ గోకవరం మండల ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం గోకవరం సంజీవయ్యనగర్‌లో మండల అధ్యక్షులు గరబారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి తూర్పుగోదావరి జిల్లా ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్ బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అక్టోబర్ 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మాదిగ విద్యార్థులు, ప్రజాప్రతినిధుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు మాదిగ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే అక్టోబర్ 17న అమరావతిలో నిర్వహించనున్న జాతీయ ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ నూతన మండల కమిటీల జాతీయ సదస్సుకు గోకవరం మండలంలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్ తదితర అనుబంధ సంఘాల గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. మండలంలో మహిళా నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళలు ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ బాధ్యతలను చేపట్టేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చింతటి వెంకన్న మాదిగ, తోలేటి రాంప్రసాద్ మాదిగ, అరసాల మోహన్ మాదిగ, మోర్త సోమరాజు మాదిగ, బొద్దాని బాపిరాజు మాదిగ, కోడి శ్రీను మాదిగ, ఆరుగుళ్ల శ్రీను మాదిగ, కోరుమిల్లి కాంతరాజు మాదిగ, అరసాల వెంకన్న మాదిగ, చింతాటి చిట్టయ్య మాదిగ, గొర్త ప్రభుదాసు మాదిగ, పెరువెల్లి దొరబాబు మాదిగ, తోలేటి సురేష్ మాదిగ, కందుకూరి వెంకన్న మాదిగ, దొండపాటి వెంకన్న మాదిగ, బొడ్డుపాటి కిష్టయ్య మాదిగ, దొండపాటి చినబాబు మాదిగ, వంగలపూడి శ్రీను మాదిగ, తోలేటి దావీదు మాదిగ, వేమగిరి ఏసు మాదిగ, తోలేటి చంద్రరావు మాదిగ, వేమగిరి అరవాలి మాదిగ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు అజారి రత్నమాల మాదిగ, తోలేటి రమ్యశ్రీ మాదిగ, ఉండ్రాసి ప్రశాంతి మాదిగ, కొమ్ము గన్నమ్మ మాదిగ, కలదిండి శారా మాదిగ, దిగుమర్తి శ్యామల మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ప్రశాంతంగా ముగిసిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు

## వాయిదా పడ్డ భీమవరపుకోట హై స్కూల్, ఎంపీపీ స్కూల్ ఎస్ఎంసి ఎన్నికలు





**కోటనందూరు, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మంగళ వారం నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో ప్రశాంతంగా ముగిసినవి. మండలంలో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 3 అప్పర్ ప్రైమరీ స్కూళ్లు, 22 ప్రైమరీ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరగగా భీమవరపుకోట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా వేయగా ఎంపీపీ స్కూల్ ఎన్నిక టైం అవ్వడంతో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉండడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలియజేశారు.

**అధికారానికి అధికారులు దాసోహం**

మండలంలో నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికలలో అధికార పార్టీ నాయకుల కు అధికారులు దాసోహం అయ్యారని ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి కి బలము ఉన్నచోట ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఓటింగ్ లో పాల్గొనకుండా అడ్డుకున్నారని భీమవరపుకోట మాజీ సర్పంచ్ జిగటాల వీరబాబు ఆరోపించారు.

**మండలంలో కూటమి బలపరిచిన అభ్యర్థలదే హవా**

మంగళవారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మండల వ్యాప్తంగా కూటమి విజయోత్సవాలు జరుపుకున్నారు. భీమవరపుకోట ఎంపీపీ స్కూల్లో నిర్వహించిన ఎన్నికలలో ఫలితం తేలక పోవడంపై అనేక విమర్శలకు దారితీసింది. మండల వ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై టీ రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై

# జీడి మామిడి రైతులకు శిక్షణ నాసా ప్రతినిధులు




**కోటనందూరు, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, తుని మండలం, హంసవరం గ్రామంలో నాసా సంస్థ ఆధ్వర్యంలో జీడి మామిడి రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఐసిఆర్‌సిపి సిబ్బంది ఆదిలక్ష్మి ప్రస్తుతం సాగులో వినియోగిస్తున్న రసాయనాలకు బదులు సేంద్రియ వ్యవసాయంలో నూతన పద్ధతులను వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి మరియు మంచి నాణ్యతను రైతులు పొందవచ్చని, సహజ వ్యవసాయం వలన చెట్టు మరియు భూమి ఆరోగ్యం మెరుగుపడి దాని ద్వారా వచ్చే ఉత్పత్తిని పొందుటకు రైతులకు అవకాశం ఉంటుందని వివరించారు.ఫీల్డ్ కోఆర్డినేటర్ పద్మ కృత్రిమ ఎరువులు , సింథటిక్, పురుగు మందులు మరియు రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి సిద్ధమైన ఎరువులను వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొంది అధిక ఆదాయమును పొందవచ్చని వివరించారు. నాసా సిబ్బంది అప్పారావు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందడానికి వీలుంటుందని తెలియజేశారు. ఈనాటి శిక్షణ కార్యక్రమంలో ద్రవ జీవామృతం తయారీ విధానమును రైతులకు ప్రత్యక్షంగా ఎలా చేయాలో వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు సరస్వతి బుల్లబ్బాయి, మరియమ్మ,రాజు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం



**కోటనందూరు, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** తుని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 2026-27 సంవత్సరానికి సంబంధించి మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై. పట్టాభి చౌదరి తెలిపారు. తుని మున్సిపాలిటీ పరిధిలో రెండు, తుని మండలంలో రెండు మరియు కోటనందూరు మండలంలో ఒక షాపు చొప్పున మొత్తం ఐదు మద్యం దుకాణాలకు ఈ టెండర్లు నిర్వహిస్తున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, కాకినాడ పేరిట మూడు లక్షల రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు వేయి రూపాయల ప్రాసెసింగ్ రుసుము చెల్లించి అక్టోబర్ ఒకటో తేదీ అర్ధరాత్రి 12 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా అక్టోబర్ మూడో తేదీన అందిన దరఖాస్తులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అక్టోబర్ ఐదో తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతి ద్వారా షాపుల కేటాయింపు చేపడతారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ విధానం ద్వారా గానీ లేదా నేరుగా తుని ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి గానీ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. వ్యాపార ఆసక్తి ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 8341181728 లేదా 9014554197 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు అని తెలిపారు

పలు అభివృద్ధి పనులకు

# శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే దివ్య




**కోటనందూరు, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా, తొండంగి మండలం పైడికొండలో పల్లె పండుగ అట్టహాసంగా జరిగింది. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే యనమల దివ్య కు పైడికొండ కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు.దాదాపు 80 లక్షల రూపాయల మేర అభివృద్ధి పనులకు ఒకే రోజు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరిగాయి.గోశాలలను ప్రారంభించిన ఎమ్మెల్యే యనమల దివ్య అనంతరం 40 లక్షలతో నిర్మించే సిమ్మెంట్ రోడ్లకు శంఖుస్థాపన చేసారు. మరికొన్ని రోడ్లకు ప్రారంభోత్సవాలు చేసిన యనమల దివ్య పల్లె ప్రగతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు నరిశే వీరస్వామి, జాగు గోవిందు,గోవిందు, మేడిశెట్టి శ్రీను, నరిశే ఫకీర్, పప్పు అప్పలరాజు, ఊటకొట్టి శ్రీధర్ ,గిరిసె శ్రీధర్రావు, పలివెల లోవరాజు, నరిశే నాగేశ్వరరావు, నక్క శేషగిరిరావు, ఘట్టం నాగబాబు,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# రాజమండ్రి మేయర్ సీటు మాదిగలకు కేటాయించాలి

**గత 80 సంవత్సరాలుగా రాజకీయ అవకాశాలు కోల్పోతున్న మాదిగలు - కూటమి విజయానికి కృషిచేసిన మాదిగలకు మేయర్ సీటు కేటాయించి రుణం తీర్చుకోవాలి**
**రాజకీయ పార్టీలలో జండా కూలీలుగా మిగిలిపోతున్న మాదిగలు - రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సీటు కేటాయించకపోతే ఉపేక్షించేది లేదు**
**మహాజన సభ సోషలిస్టు పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో మేయర్ సీటును మాదిగలకు కేటాయించాలని మహాజన సభ సోషలిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి మేయర్ సీటును మాల సామాజిక వర్గానికి చెందిన ఎంఎస్ చక్రవర్తికి కేటాయించారని, అలాగే స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా మాల సామాజిక వర్గానికి చెందిన బర్రె కొండబాబు ఇచ్చారని అన్నారు. ఇప్పటివరకు మేయర్లుగా బీసీ రిజర్వేషన్ కోటాలో ఆ సామాజిక వర్గానికి చెందిన ఆదిరెడ్డి వీరరాఘవమ్మకు, ఓసి రిజర్వేషన్ కోటాలో పంతం రజిని శేష సాయికి, ఎస్సీ కోటాలో ఎమ్మెస్ చక్రవర్తి కి కేటాయించారని వివరించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాదిగలకు అనాదిగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి ఎస్సీ సామాజిక వర్గంలోనే ఉన్న మాదిగలకు రాజమండ్రి మేయర్ సిటు కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ విజయానికి కృషి చేసిన మాదిగల రుణాన్ని మేయర్ సీటు కేటాయించి తీర్చుకోవాలని కోరారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చి చౌదరి ఇప్పటివరకు మాదిగలకు చేసింది ఏమీ లేదని తెలిపారు. ఇప్పటికైనా బుచ్చయ్య చౌదరి మాదిగలకు రాజమండ్రి మేయర్ సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కూడా మాదిగలకు సీటు కేటాయించేలా కృషి చేయాలని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికలలో మాదిగలకు సీటు కేటాయిస్తే ఎస్సీ సామాజిక వర్గంలోని మాల, మాదిగ, రెల్లి కులస్తులు ఐక్యంగా మాదిగ అభ్యర్థిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మాదిగలకు ఓటు బ్యాంకు ఉందని తెలిపారు. 80 సంవత్సరాల కాలంగా మాదిగలను ఓటర్ గానే చూస్తున్నారని అన్నారు. ఈసారి రాజమండ్రి నగర మేయర్ సీటు ను మాదిగలకు కేటాయించి రాజకీయ అవకాశం కల్పించాలని కోరారు. దళితులలో ఒక కులానికి అవకాశం ఇచ్చినప్పుడు, రెండో కులానికి కూడా అవకాశం ఇవ్వాలని సూచించారు. రాజమండ్రి నగరంలో జనాభాపరంగా మాదిగలు ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. తమకు రెల్లి కులస్తుల సహకారం ఉందని, మాదిగల 100 శాతం ఉంటే, రెల్లి కులస్తులు 40 శాతం మంది ఉన్నారని అన్నారు. మొత్తం మీద మాదిగలకు ఓటింగ్ శాతం ఎక్కువగానే ఉందని పేర్కొన్నారు. రెల్లీలు అయిన మాదిగ లు అయిన మాల లు అయినప్పటికీ అన్నదమ్ముల్లా కలిసి ఉండాల్సిందేనని సీటు ఎవరికి కేటాయించిన కలిసి గెలిపించుకుంటామని అన్నారు. కూటమి ప్రభుత్వ ఒకటి గుర్తుంచుకోవాలని టిడిపి, జనసేన, బిజెపి, మూడు పార్టీలు అయితే నాలుగవ పార్టీ ఎమ్మార్పీఎస్ అని తెలిపారు. గత ఎన్నికలలో ఎమ్మార్పీఎస్ మద్దతుతోనే కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని అన్నారు. మేయర్ సిటీ మాదిగ లకు కేటాయించి రుణం తీర్చుకోవాలని పిలుపు ఇచ్చారు. మాదిగలకు రాజకీయ అవకాశం కల్పించకపోతే భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకువెళ్లి తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామని అన్నారు. మాదిగలకు ఎవరు సీటు కేటాయించిన వార్డుల్లో తిరిగి మాదిగ అభ్యర్థులను గెలిపించుకుంటామని అన్నారు. ఎమ్మార్పీఎస్ అన్ని వర్గాల వారికి సేవ చేసిందని వివరించారు. ఆరోగ్యశ్రీ, వికలాంగుల పెన్షన్, వృద్ధుల పెన్షన్, ఇలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు జెండాలు మోసే కూలీలు గానే మాదిగలు మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి కార్పొరేషన్ మేయర్ సీటును మాదిగలకు కేటాయించి కూటమి ప్రభుత్వం మాదిగ రుణం తీర్చుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దొండపాటి క్రిష్టాఫర్ మాదిగ, డాన్ సూరి మాదిగ, అనపర్తి సురేంద్ర మాదిగ, బల్లంకుల రాజు మాదిగ, గంగా దావీదు మాదిగ,ఎలక వెంకట్ రమణ మాదిగ, దొండపాటి పండు మాదిగ, కూరాకుల రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి వైఫల్యాలను నిలదీద్దాం

**అక్టోబర్ 5న వైఎస్ఆర్సీపీ భారీ బహిరంగ సభ - పార్టీ అనుబంధ కమిటీలకు బాధ్యతల అప్పగింత**
**తాజా మాజీ ప్రజాప్రతినిధులకు సత్కారం - బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిద్దాం : జక్కంపూడి రాజా**

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజా పక్షాన నిలదీసేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన రాజానగరం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 5న నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు పార్టీ మండల, గ్రామ స్థాయి అనుబంధ కమిటీల్లో వివిధ బాధ్యతలు పొందిన నాయకులు బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గత ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికైన తాజా మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులను సత్కరించనున్నట్లు రాజా తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి గ్రామంలో అన్ని పదవులకు పోటీ చేసే విధంగా ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

**'అడుగు' నినాదంతో ప్రజల్లోకి....**

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజా సూచించారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ప్రకటించిన 'సూపర్ సిక్స్'తో పాటు ఇతర హామీల అమలుపై ప్రజల తరఫున ప్రశ్నించేందుకు 'అడుగు' నినాదంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. నిరుద్యోగ భృతి ఏదని అడుగు, ఆడబిడ్డ నిధి ఏదని అడుగు, మూడు సెంట్లు ఇంటి స్థలం ఏదని అడుగు,50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళ లకు పింఛను ఏదని అడుగు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఎక్కడని అడుగు, 20 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని అడుగు అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజల తరఫున ప్రశ్నించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత, అవినీతి, అక్రమాలపై ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. వార్డు స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు 'అడుగు' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ల అమలు పరిస్థితిని ప్రజలకు వివరించాలని సూచించారు. హామీలు అమలు చేయకుండా ప్రజల్లోకి వచ్చే కూటమి నాయకులు, ప్రజాప్రతి నిధులను ప్రజలు ప్రశ్నించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. గతంలో మాదిరిగా రాజానగరం నియోజక వర్గంలోని మూడు మండలాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే దిశగా నాయ కులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని రాజా పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రచార విభాగం అధ్య క్షులు అడబాల చినబా బు, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్క రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు, దూలం పెద్ద, అడపా కనకరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, డివిజన్ ఇన్‌చార్జులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



**సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్ల ఎంపానెల్‌మెంట్ పాలసీని**

# ప్రభుత్వం రద్దు చేయాలి

**విలేకరుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి - విలేకరులపై అక్రమ కేసులు పెట్టడం ఆపాలి**
**ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ ను కూల్చేందుకు కుట్ర**
**జే.డి.ఆర్.ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ డిమాండ్**




**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** సోషల్ మీడియా ఇన్ఫ్ లెన్ సర్ల ను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్ల ఎంపానెల్‌మెంట్ పాలసీ ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని జే.డి.ఆర్.ఎఫ్ (జర్నలిస్ట్ డెమొక్రటిక్ రైట్స్ ఫారం) జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్షరాన్ని నమ్ముకుని జీవిస్తున్న విలేకరులను రోడ్డున పడవేసి, అక్షరాన్ని అమ్ముకునే ఇన్ఫ్యులెన్స్ లకు ప్రాధాన్యత ఇవ్వడం తగదని అన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య ఇస్తూ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని అన్నారు. గతంలో రాజుల పాలనలో బట్రాజుల విధానం ఉండేదని వారి చేత రాజులను కీర్తిస్తూ కవితలు వ్యాఖ్యలు చేసే వారిని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇన్ఫ్లెన్సర్ల విధానం కూడా బటరాజుల విధానంతో పోలి ఉందని పేర్కొన్నారు.ఈ జీవోను తక్షణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేయకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి భజన చేసే వారిని గౌరవ వేతనం ఇచ్చి ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ అయిన జర్నలిజాన్ని కూల్చేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను అగౌరవపరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమంజసం కాదని అన్నారు. అక్రమ సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్ల వల్ల జర్నలిస్టుల ఉనికి ప్రమాదంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై సర్వే చేసి జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్రం నిధులతో, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల పై అక్రమ కేసులు పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన జర్నలిస్టుల కుటుంబాలు బ్రతకడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జెడిఆర్ఎఫ్ జర్నలిస్టుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందని అన్నారు. నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, కోనసీమ జిల్లాలో జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడితే వారికి అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె డి ఆర్ ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మారంపూడి సోమరాజు, జిల్లా అధ్యక్షులు గాదె గిరీష్ కుమార్ గుప్త, కార్యదర్శి సింగంశెట్టి సూర్య రాఘవేంద్ర, ట్రెజరర్ పిచ్చుక మహేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటగా పామ్ ఆయిల్ : ఎమ్మెల్సీ సోము




**కోరుకొండ, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్నినో ప్రభావంతో రైతులు వరికి బదులుగా ఆయిల్ పామ్ తోటలు వేసుకోవాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. మంగళవారం మండలం కనుపూరు గ్రామంలో ఆయిల్ ఫామ్ విస్తరణ మహోత్సవం కార్యక్రమాన్ని పతాంజలి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యవసాయక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సోము మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావంతో రైతులు వరికి బదులుగా ఆయిల్ ఫామ్, ఇతర ఆరుతడి పంటలను వేసుకోవాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తుందన్నారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తుందని, రైతులు ప్రభుత్వ ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకొని ఆయిల్ ఫామ్ తోటలు, ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. అనంతరం పతంజలి ఫుడ్స్ సంస్థ డీజీఎం ఏఎస్ ప్రకాష్ మాట్లాడుతూ సోము వీర్రాజు వ్యవసాయ క్షేత్రంలో పామ్ ఆయిల్ పంటకు ఆదర్శంగా ఉంటుంద న్నారు. రైతులు ఆయిల్ ఫామ్ తోటలకు మూడేళ్ల పాటు సకాలంలో ఎరువులు,నీటియాజమాన్యం, వంటి అంశాలపై శ్రద్ధ వహిస్తే తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలం పాటు అధిక ఆదాయం పొందవచ్చు అన్నారు. హార్టికల్చర్ అధికారి పి రిని మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు ఈ ప్రాంతం భూములు అనుకూలంగా ఉన్నాయని, వరితో పోల్చితే ఆయిల్ ఫామ్ కు వాతావరణ మార్పులు, వివిధ సమస్యలు చాలా తక్కువగా ఉంటాయని,రైతులకు అత్యధిక ఆదాయం అందించడంలో ఆయిల్ ఫామ్ పంట ముందువరుసలో ఉంటుందన్నారు. ఆయిల్ పంప్ సాగుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుందని, రైతులు కూడా ఎక్కువగా ఉద్యాన పంటలకు మొగ్గుచూపు తున్నారన్నారు. గతంలో గ్రామంలో 20 ఎకరాలు, మండల పరిధిలో 90 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేసేవారని, నేడు అధిక శాతం రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారన్నారు. అదేవిధంగా డ్రిప్ ద్వారా తోటకు ఎరువులు పెట్టుట వలన ఉపయోగా లను,అంతరపంటల సాగు రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో రైతులు కొల్లాటి రామకృష్ణ,ముంద్రు నరసింహా రావు, అడపా సురేష్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ డిఎస్ శ్రీనివాస్, పామ్ ఆయిల్ కంపెనీ సిబ్బంది వి దుర్గా ప్రసాద్, టీఎస్ రాజేష్, వివి నవీన్, జేబీవీ రామరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మన ఆరోగ్యం మనచేతుల్లోనే...

**వరల్డ్ హార్ట్ డే కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనా**
**కార్డియాక్ హెల్త్ ప్యాకేజి ప్రకటించిన సాయి హాస్పిటల్స్ ఎండి డాక్టర్ విజయకుమార్**
**కళాకేంద్రం నుండి పుష్కర్ ఘాట్ మీదుగా వాక్థాన్**




**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని గ్రహించి తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని, అందునా గుండెకు సంబంధించి మరిన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సాయి హాస్పిటల్స్ ఆధ్వర్యాన మంగళవారం ఉదయం వాక్థాన్ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం నుండి చేపట్టారు. ముఖ్య అతిధిగా హాజరైన కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఉదయం కానీ, సాయంత్రం కానీ నడక అలవాటు చేసుకుని, నిత్యం దాన్ని తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. అలాగే కనీస వ్యాయామం చేయడం, ఆటలు ఆడడం అవసరమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టంచేసారు. సాయి హాస్పిటల్ ఎండీ డాక్టర్ కురుకూరి విజయకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం కంటే ముఖ్యమైనది ఏదీ లేదని గ్రహించాలన్నారు. ఆరోగ్యం కోసం రోజుకి కనీసం 45నిముషాలు నడకకు కేటాయించాలని సూచించారు. ప్రతియేటా తప్పనిసరిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలని ఆయన సూచిస్తూ, దీనివలన సమస్యను ముందస్తుగా గుర్తించి తగిన వైద్యం పొందడానికి వీలవుతుందన్నారు. ఈసందర్బంగా రూ 2,500లతో సాయి హాస్పిటల్ కార్డియాక్ హెల్త్ ప్యాకేజిని ఆయన ప్రకటిస్తూ, లాంఛనంగా ప్రారంభించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ నిరంతరాయం గుండె పనిచేస్తూనే ఉంటుదని, అలాంటప్పుడు దానిపట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో అర్ధం చేసుకోవాలన్నారు. ఈమధ్య కాలంలో కార్డియాక్ అరెస్టు కారణంగా సంభవిస్తున్న పరిణామాలను గమనించి గ్యాస్ నొప్పి లాంటివి వచ్చినా అశ్రద్ధ చేయకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. షుగర్, బిపిలను తరచూ చెక్ చేయించుకోవాలన్నారు. ముందస్తు చర్యల ద్వారా గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చని ఆయన అన్నారు. అనంతరం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వాక్థాన్ ను కమిషనర్ రాహుల్ మీనా లాంఛనంగా ప్రారంభించారు. కళా కేంద్రం నుండి ప్రారంభమయ్యే వాక్థాన్, పుష్కర్ ఘాట్, కోటగుమ్మం , కందకం రోడ్, జెండా పంజా రోడ్, జంక్షన్ మీదుగా దేవి చౌక్, గోకవరం బస్టాండ్ సెంటర్ మీదుగా తిరిగి ఆనం కళా కేంద్రానికి చేరుకుంది. గుండెపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, వాక్థాన్ పొడవునా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి కుమార్, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ సమీర్ మల్లంపాటి, సాయి హాస్పిటల్ సి ఇ ఓ నాగేంద్ర, వివిధ సూపర్ స్పెషాలిటీల వైద్య నిపుణులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మండలంలోని 46 పాఠశాలల్లో**

# సందడిగా ఎస్ఎంసీ ఎన్నికలు

**వివరాలను వెల్లడించిన డివైఈఒ రామలక్ష్మణమూర్తి**




**రాయవరం, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని 46 పాఠశాలల్లో మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలవ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలలు, 38 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. దాదాపు అన్ని పాఠశాలల్లో కమిటీ సభ్యుల ఎంపిక ఏకగ్రీవంగా జరగగా, కొన్ని పాఠశాలల్లో ఓటింగ్ విధానం ద్వారా సభ్యులను ఎన్నుకున్నారు. డివైఈఓ పి. రామలక్ష్మణమూర్తి తెలిపిన వివరాల మేరకు గతంలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎంపిక చేసి 15 మందితో కమిటీని ఏర్పాటు చేసే విధానం ఉండేదని, ప్రస్తుతం నూతన విధానంలో పాఠశాల వ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎంపిక చేస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 100 మందిలోపు ఉంటే 12 మంది సభ్యులతో, 100 మందికి పైగా ఉంటే 15 మంది సభ్యులతో ఎస్ఎంసీని ఏర్పాటు చేస్తారని తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎం. హరిబాబు, వైస్ చైర్మన్‌గా ఎన్. కాంతమణి ఎన్నికయ్యారు. కూర్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పి. నాగలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కె. వీరబాబు ఎంపికయ్యారు. చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పి. సతీష్, వైస్ చైర్మన్‌గా కె. సుకన్య ఎన్నికయ్యారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా పట్నాల జగదీష్, వైస్ చైర్మన్‌గా భువనగిరి జాహ్నవి ఎన్నికయ్యారు. పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా కాటుక వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా కాదా శేషారత్నం ఎంపికయ్యారు. మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా గొడ్తి ఆంజనేయులు, వైస్ చైర్మన్‌గా గుంటముక్కల సాయి లక్ష్మి ఎన్నికయ్యారు. అలాగే సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మన్ని నారాయణమూర్తి, వైస్ చైర్మన్‌గా గరగ బద్రి ఎన్నికయ్యారు. వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా నాసూరి దేవి, వైస్ చైర్మన్‌గా కొవ్వూరి జ్యోతి ఎన్నికయ్యారు. ఎన్నికల సందర్భంగా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నూతనంగా ఏర్పడిన ఎస్ఎంసీలు పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాల కల్పన, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని డివైఈఓ తెలిపారు.

**గుమ్ములూరు జిల్లా ప్రజాపరిషత్**

# ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పెంటపాటి



**కోరుకొండ, సెప్టెంబర్ 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గుమ్ములూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని తెలిపారు. మంగళవారం ఏకగ్రీవంగా జరిగిన పాఠశాల విద్యకమిటీ చైర్మన్ గా పెంటపాటి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ గా మద్ద సుహాసిని, కో ఆప్షన్ సభ్యురాలుగా తాడిపల్లి శోభన,ఇజ్జిన వరలక్ష్మిలను ఏకగ్రీవంగా విద్యార్థులు తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి పాఠశాల అభివృద్ధికి కలిసి పని చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని, మాజీ సర్పంచ్ చిటికెన భాస్కరరావు, కొవ్వాడ రాజేంద్రప్రసాద్,కంచుమర్తి దుర్గాప్రసాద్, చిటికెన గోపాలకృష్ణ, చిటికెన శ్రీనివాస్,మట్ట రామచంద్రరావు, బూరుపూడి సొసైటీ డైరెక్టర్ బాలిన వెంకటేశ్వర్లు,కాటే కృష్ణ ప్రసాద్, గొర్రెల సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



# అల్లు స్నేహారెడ్డి సరికొత్త ట్రెండ్..

## డిజిటల్ ఐకాన్‌గా ప్రత్యేక గుర్తింపు



పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఆయన రాకా చిత్రీకరణలో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే బన్నీ సతీమణి అల్లు స్నేహారెడ్డి సైతం సినీ ప్రియులకు సుపరిచితమే. ప్రపంచానికి ఆమె స్టార్ హీరో సతీమణిగా పరిచయమైనప్పటికీ.. అటు తల్లిగా, ఇటు బిజినెస్ ఉమెన్‌గా, సోషల్ మీడియా సెలబ్రెటీగా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ సృష్టించుకున్నారు. పాన్ ఇండియా స్టార్ హీరో అల్లు అర్జున్ సతీమణి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం తన ఫోటోషూట్లతోపాటు పిల్లలకు సంబంధించిన ఫోటోస్, ఫ్యామిలీ ఈవెంట్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటారు. అయితే స్నేహా రెడ్డి అంటే చాలామందికి ముందుగా గుర్తుకు వచ్చేది స్టార్ హీరో అల్లు అర్జున్ భార్యగానే. కానీ ఇప్పుడు ఆమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అటు బన్నీ సతీమణిగా ప్రతి క్షణం అల్లు అర్జున్ తోడుగా ఉంటూనే.. మరోవైపు వ్యాపారవేత్తగా, తన పిల్లలకు తల్లిగా, ఫిట్‌నెస్ ప్రియురాలిగా, డిజిటల్ పర్సనాలిటీగా స్నేహా రెడ్డి తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు. అంతేకాదు నిత్యం నెట్టింట చాలా యాక్టివ్ గా ఉంటూ ఏదోక పోస్ట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటారు. అందుకే ఆమె సోషల్ మీడియాలో ఆమెకు 91 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇదిలా ఉంటే.. స్నేహా రెడ్డి నిర్వహిస్తున్న పికాబూ స్టూడియో ఆమె వ్యాపార ప్రయాణంలో ముఖ్యమైన భాగంగా ఉంది. మరోవైపు ఫిట్‌నెస్, ఆరోగ్యంపై కూడా ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపుతారు స్నేహా రెడ్డి. తరచూ తన వర్కౌట్స్, యాక్టివ్ లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. అలాగే మహిళలకు కావాల్సిన ఫిట్నెస్, ఆరోగ్య టిప్స్ కూడా చెప్తుంటారు. ఎప్పుడూ బిజీగా ఉండే ఆమె.. తన కుటుంబానికి కూడా స్నేహా రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. తన పిల్లలతో కలిసి గడిపే అందమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. అలాగే ఆమె షేర్ చేసే ట్రావెల్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ పోస్టులకు కూడా మంచి ఆదరణ లభిస్తోంది. అల్లు అర్జున్‌తో వివాహం కారణంగా స్నేహా రెడ్డి దేశంలోని ప్రముఖ సెలబ్రిటీ కుటుంబాల్లో ఒకటైన అల్లు కుటుంబంలో భాగమయ్యారు. అయితే కాలక్రమంలో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకున్నారు. వ్యాపారం, కుటుంబం, ఫిట్‌నెస్, ట్రావెల్, సోషల్ మీడియా ఇలా అన్ని రంగాలను సమతూకంగా కొనసాగిస్తూ స్నేహా రెడ్డి తనకంటూ ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆమెను అల్లు అర్జున్ భార్యగా మాత్రమే కాకుండా విజయవంతమైన వ్యాపారవేత్తగా, ప్రముఖ డిజిటల్ సెలబ్రిటీగా కూడా గుర్తిస్తున్నారు.



# ఇది కదా మెగాస్టార్ రేంజ్ అంటే!

**ఓటీటీషోకు హోస్ట్‌గా చిరంజీవి భారీ రెమ్యునరేషన్!**

గతంలో 'మీలో ఎవరు కోటీశ్వరుడు' అనే క్విజ్ రియాలిటీ షోకు హోస్ట్ గా వ్యవహరించారు మెగాస్టార్ చిరంజీవి. తనదైన స్క్రీన్ ప్రజెన్స్, హోస్టింగ్ తో షోను రక్తి కట్టించారు. ఇప్పుడు మరో టాక్ షోకు మెగాస్టార్ రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ ఈ మెగా టాక్ షో ను ప్లాన్ చేస్తోందని సమాచారం. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్నారు. మన శంకరవరప్రసాద్ గారు ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో వరుసగా సినిమాఉల చేస్తున్నారాయన. ప్రస్తుతం చిరంజీవి బాబీ కొల్లి తో కాకా, వశిష్టతో విశ్వంభర, శ్రీకాంత్ ఓదెలతో సినిమాలు చేయనున్నాడు. అయితే ఇంత బిజీ షెడ్యూల్ లోనూ చిరంజీవి ఓ టాక్ షో చేయనున్నాడని తెగ ప్రచారం జరుగుతోంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ ఈ సెలబ్రిటీ టాక్ షోను ప్లాన్ చేస్తోందని, ఇందుకు మెగాస్టార్ ను హోస్ట్ గా వ్యవహరించనున్నారని సమాచారం. తెలుగుతో పాటు ఇతర భాషలకు చెందిన ప్రముఖులు చిరంజీవి టాక్ షోకు రానున్నారని, ఇప్పటికే ఈ షో కోసం రోడ్ మ్యాప్ పూర్తయ్యిందని టాక్. ఇందుకు సంబంధించి నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు ఆల్రెడీ చిరంజీవి టీమ్ తో సంప్రదించారని, అతి త్వరలోనే ఈ టాక్ షో గురించి అధికారికంగా అనౌన్స్ మెంట్ చేయనున్నారని సమాచారం. ఇదిలా ఉంటే సుమారు 47 ఏళ్ల సినిమా కెరీర్ లో చిరంజీవి పెద్దగా టాక్ షోలు చేయలేదు. కొన్నేళ్ల క్రితం 'మీలో ఎవరు కోటీశ్వరుడు' అనే క్విజ్ రియాలిటీ షోకు మాత్రమే హోస్ట్ గా వ్యవహరించారు. తనదైన స్క్రీన్ ప్రజెన్స్, హోస్టింగ్ తో షోను రక్తి కట్టించారు. దీని తర్వాత ఇప్పుడు మరో టాక్ షోకు మెగాస్టార్ రెడీ అవుతున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఈ సెలబ్రిటీ టాక్ షో కోసం చిరంజీవికి 200 కోట్ల రూపాయల భారీ పారితోషికాన్ని నెట్‌ఫ్లిక్స్ ఆఫర్ చేసిందట. ఓటీటీ హిస్టరీలో ఓ టాక్ షో కోసం ఇంత భారీ అమౌంట్ ఆఫర్ చేయడం ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. ఇందులో నిజమెంతుందో తెలియదు కానీ ప్రస్తుతం ఈ వార్త సినిమా సర్కిళ్లలో హాట్ టాపిక్ గా మారింది. ఒక వేళ ఇదే నిజమైతే ఓటీటీ హిస్టరీలోనే అత్యధిక రెమ్యునరేషన్ అందుకున్న హీరోగా చిరంజీవి మరో ఘనతను అందుకుంటారు. కాగా నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందనున్న చిరంజీవి టాక్ షోకి సంబంధించిన చర్చలు, ఒప్పంద వ్యవహారాలను చిరంజీవి పెద్ద కుమార్తె సుష్మిత కొణిదెల దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని సమాచారం. త్వరలోనే ఈ టాక్ షోకు సంబంధించి మరిన్ని అప్డేట్స్ రానున్నాయని టాక్.

# వర్షాన్ని సైతం తట్టుకొని పరుగు.. ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో బంగారు పతకం

2026 ఆసియా క్రీడల్లో భారత మహిళల 4×400ఎ రిలే జట్టు బంగారు పతకం సాధించింది. కిరణ్, పూవమ్మ, ప్రాచి, విథ్యా రామ్‌రాజ్ బృందం 3:29.69 నిమిషాల్లో రేసు పూర్తి చేసి భారత్‌కు 6వ స్వర్ణం అందించింది. దీంతో దేశం మొత్తం పతకాల సంఖ్య 51కి చేరింది. జపాన్ వేదికగా కొనసాగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సంచలన ప్రదర్శనతో దూసుకుపోతున్నారు. తాజాగా జరిగిన మహిళల 4ఐ400 మీటర్ల రిలే రేస్ ఈవెంట్‌లో భారత జట్టు బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రీడల్లో భారత్‌కు ఇది 6వ స్వర్ణ పతకం కావడం విశేషం. పరుగు పందెంలో మొదటి నుంచి చివరి వరకు అద్భుతమైన ఆధిపత్యం ప్రదర్శించిన మన క్రీడాకారిణులు, దేశానికి మరొక మరపురాని విజయాన్ని అందించారు. భారత క్రీడా ప్రపంచం ప్రస్తుతం ఈ ఘనతపై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ఈ ఘన విజయంలో భారత రిలే బృందానికి చెందిన కిరణ్, మచేత్తిరా పూవమ్మ, ప్రాచి, విత్య రామ్‌రాజ్ అత్యంత కీలక పాత్ర పోషించారు. ట్రాక్‌పై రేస్ ప్రారంభమైనప్పటి నుంచీ ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వీరు పరుగెత్తారు. భారత జట్టు సరిగ్గా 3:29.69 నిమిషాల వ్యవధిలో రేసును పూర్తి చేసి మొదటి స్థానంలో




నిలిచింది. ఈ జట్టులోని విత్య రామ్‌రాజ్‌కు ఈ టోర్నీలో ఇది రెండో పతకం కావడం గమనార్హం. అంతకుముందు ఆమె 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు. ఫైనల్ రేస్ సమయంలో మైదానంలో భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భారత అథ్లెట్లు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. తడిసిన ట్రాక్‌పై పరుగెత్తడం కష్టమైనప్పటికీ, మన క్రీడాకారిణులు సమయోచితంగా స్పందించి విజయం సాధించారు. బలమైన బహ్రెయిన్ జట్టు 3:30.21 నిమిషాల్లో రేసును పూర్తి చేసి రజత పతకానికే పరిమితమైంది. భారత్ కంటే కేవలం 0.52 సెకన్ల తేడాతో బహ్రెయిన్ రెండో స్థానానికి పడిపోయింది. ఇక ఆతిథ్య చైనా జట్టు 3:31.02 నిమిషాల సమయంతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు భారత్ క్రికెట్, కబడ్డీ, షూటింగ్ వంటి విభాగాలోనే స్వర్ణ పతకాలు గెలుచుకుంది. ఈ విజయం ట్రాక్ అండ్ ఫీల్డ్ (అథ్లెటిక్స్) విభాగంలో భారత్‌కు లభించిన మొట్టమొదటి బంగారు పతకం కావడం దీని ప్రత్యేకత. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని, రికార్డు స్థాయిలో రేసును ముగించి మన మహిళా జట్టు భారత్ జెండాను రెపరెపలాడించింది. విత్య రామ్‌రాజ్ ప్రదర్శించిన పట్టుదల భారత అథ్లెటిక్స్ రంగానికి సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. ఈ ఆరో స్వర్ణ పతకంతో భారత్ ఆసియా క్రీడల పతకాల పట్టికలో ఏకంగా 10వ స్థానానికి ఎగబాకింది. ఇప్పటివరకు భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య 51కి చేరింది. ఇందులో 6 స్వర్ణాలు, 21 రజతాలు, 24 కాంస్య పతకాలు ఉన్నాయి. భారత్ 50 పతకాల మైలురాయిని దాటడంలో ఈ మహిళా రిలే టీమ్ విజయం ఎంతగానో ఉపయోగపడింది. రాబోయే ఈవెంట్లలో మరిన్ని పతకాలు సాధించి భారత్ తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంటుందని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

# ఏషియన్ గేమ్స్‌లో ఒకే అథ్లెట్ మూడు పతకాలు.. సంచలనం సృష్టించిన భారత రన్నర్

2026 ఆసియా క్రీడల్లో భారత రన్నర్ గుల్వీర్ సింగ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. 5000 మీటర్ల రేసులో కాంస్యం సాధించి ఒకే ఏషియన్ గేమ్స్‌లో మూడు వ్యక్తిగత పతకాలు గెలిచిన మొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ అద్భుతమైన ప్రదర్శనతో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల 5000 మీటర్ల పరుగు పందెం ఫైనల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని ముద్దాడాడు. ఈ టోర్నమెంట్‌లో గుల్వీర్ సింగ్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. ఏషియన్ గేమ్స్ చరిత్రలోనే ఒకే ఎడిషన్‌లో మూడు వ్యక్తిగత పతకాలు సాధించిన మొదటి భారతీయ అథ్లెట్‌గా గుల్వీర్ నిలిచాడు. అతని సుదీర్ఘ పరుగు భారత క్రీడా ప్రపంచంలో సరికొత్త సంచలనం సృష్టించింది. పురుషుల 5000 మీటర్ల ఫైనల్ పోటీ అత్యంత ఉత్కంఠగా సాగింది. గుల్వీర్ సింగ్ ఈ రేసును 13:32.75 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచాడు. బహ్రెయిన్‌కు చెందిన స్టార్ రన్నర్ బిర్హాను బాలేవ్ 13:30.79 నిమిషాల సమయంతో మొదటి స్థానం సాధించి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. అలాగే జపాన్‌కు చెందిన టోమోనోరి యమగుచి 13:31.43 నిమిషాల్లో రేసు ముగించి రజత పతకాన్ని




కైవసం చేసుకున్నాడు. గుల్వీర్ చివరి క్షణం వరకు పట్టు వదలకుండా పోరాడి భారత్‌కు మరొక మెడల్ తెచ్చిపెట్టాడు. ఈ 5000 మీటర్ల ఈవెంట్‌లో నిజానికి భారత్ తరపున ప్రముఖ అథ్లెట్ అవినాష్ సాబ్లే బరిలోకి దిగాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల అవినాష్ ఈ పోటీలో పాల్గొనలేకపోయాడు. ఆ స్థానంలో గుల్వీర్ సింగ్‌కు అవకాశం లభించింది. తనకు వచ్చిన అరుదైన అవకాశాన్ని గుల్వీర్ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నాడు. ట్రాక్‌పై అద్భుత వేగం ప్రదర్శించి కాంస్య పతకం గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ విజయంతో ఆసియా అథ్లెటిక్స్ రంగంలో అతడి పేరు గట్టిగా వినిపిస్తోంది. ఈ 5000 మీటర్ల రేసులో కాంస్యం సాధించడానికంటే ముందే గుల్వీర్ రెండు రజత పతకాలను తన ఖాతాలో వేసుకున్నాడు. 10,000 మీటర్ల సుదీర్ఘ రేసులో 28:29.38 నిమిషాల సమయంతో మొదటి రజతం గెలుచుకున్నాడు. ఆ తర్వాత 1500 మీటర్ల పరుగులో తన వ్యక్తిగత ఉత్తమ రికార్డు (3:36.72 నిమిషాలు) నమోదు చేస్తూ రెండో రజతాన్ని సాధించాడు. ఇప్పుడు 5000 మీటర్ల కాంస్యంతో కలిపి మొత్తం మూడు పతకాలతో టోర్నీని చిరస్మరణీయంగా ముగించాడు. గుల్వీర్ సింగ్ సాధించిన ఈ చారిత్రక కాంస్య పతకంతో భారత మెడల్స్ సంఖ్య మరింత బలోపేతమైంది. విభిన్న రేసుల్లో వరుసగా ప్రతిభ చూపుతూ భారత క్రీడా రంగానికి సరికొత్త దిశ చూపించాడు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఒక్కడే మూడు వ్యక్తిగత పతకాలు సాధించడం సాధారణ విషయమేమీ కాదు. గుల్వీర్ ప్రదర్శించిన పట్టుదల, క్రమశిక్షణ రాబోయే తరం అథ్లెట్లకు ఎంతో స్ఫూర్తినిస్తాయి. ఆసియా క్రీడల్లో భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు నమోదు చేస్తున్న ఈ విజయాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com